

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 19-01-2026 | సంపుటి - 26 | సంచిక -240 | రూ : 4 | పేజీలు: 8




2లో

## : మీరు, మీరు చూసుకోండి..

# మా మంత్రుల జోలికి రావొద్దు

- మీడియా సంస్థల మధ్య గొడవలుంటే తలుపులు మూసుకొని కొట్టుకోవాలన్న సీఎం రేవంత్
- మంత్రులను బద్నాం చేయవద్దు, రాసేముందు తన వివరణ తీసుకోవాలని సూచన
- సింగరేణి టెండర్లలో అవినీతికి తావులేదు, అనుభవం ఉన్నవారికే కాంట్రాక్టులు అని స్పష్టం
- అయోధ్యలా భద్రాచలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ, బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు
- ఖమ్మంలో రూ.362 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

## మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ

# మహిళలకు ఉచిత ప్రయాణం

- బస్సు చార్జీలను ఖరారు చేసిన ఆర్టీసీ
- హైదరాబాద్ నుంచి రూ.600 - రూ.1,110
- వరంగల్, హనుమకొండ నుంచి రూ.250 నుంచి రూ.500

2లో




## ట్రంప్ తీరుకు వ్యతిరేకంగా

# ఈయూ దేశాల ఎమర్జెన్సీ మీటింగ్!



2లో

- ఈయూ దేశాలపై టారిఫ్ లు విధించడాన్ని తీవ్రంగా తప్పుబట్టిన నేతలు
- అమెరికా, ఈయూల సంబంధాలపై ప్రభావం పడుతుందని ఆందోళన
- డెన్మార్క్ సైనిక విన్యాసాలకు మద్దతు పలికిన ఈయూ నేతలు



2లో


## యూపీలో దట్టమైన పొగమంచు..

# ఎన్‌హెచ్9పై వాహనాల బీభత్సం

- యూపీలోని అమ్రోహాలో దట్టమైన పొగమంచుతో ప్రమాదం
- లక్నో-ఢిల్లీ జాతీయ రహదారిపై ఢీకొన్న పదుల సంఖ్యలో వాహనాలు
- ప్రమాదంలో 12 మందికి పైగా గాయాలు
- ప్రమాదంతో భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ పర్యవేక్షణకు యువ ఐపీఎస్ ఆఫీసర్లు!

- హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై రేవంత్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- కీలకమైన ట్రాఫిక్ విభాగాల్లోకి యువ ఐపీఎస్ అధికారుల నియామకం
- సైబర్ క్రైమ్, డ్రగ్స్‌తో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం




2లో

## ఆయన బెంగళూరులో ఉంటే

# అదే రాజధాని అవుతుందా?



2లో

- ఎన్టీఆర్ 30వ వర్ధంతి సభలో నివాళులర్పించిన సీఎం చంద్రబాబు
- ఎన్టీఆర్ సంక్షేమ బాటలోనే కూటమి ప్రభుత్వం పయనిస్తోందని వెల్లడి
- ఏపీ రాజధాని అమరావతే అని ఉద్ఘాటన
- గత ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు, 'క్రెడిట్ చోరీ' ఆరోపణల ఖండన
- 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం
- రాష్ట్రంలో రౌడీయిజం, అరాచకాలను ఉపేక్షించబోమని హెచ్చరిక

## 10,000 మందితో కన్నులపండువగా

# బగురుంబా నృత్యం.. వీడియో షేర్ చేసిన ప్రధాని

- అస్సాంలో రెండ్రోజుల పర్యటనకు ప్రధాని మోదీ
- గువాహటిలో 10,000 మంది కళాకారులతో బగురుంబా నృత్య ప్రదర్శనలో పాల్గొన్న ప్రధాని
- ప్రపంచ వేదికపై బోడో సంప్రదాయ నృత్యాన్ని నిలపడమే లక్ష్యమన్న సీఎం హిమంత
- ఒకప్పటి హింస నుంచి శాంతి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా ఈ కార్యక్రమం

2లో



# ఆయన బెంగళూరులో ఉంటే అదే రాజధాని అవుతుందా?

ముఖ్యమంత్రి ఎక్కడ ఉంటే అదే రాజధాని అవుతుందా? మరి ఆయన (జగన్) ఎక్కువగా బెంగళూరులో ఉండేవారు, అటువంటప్పుడు దాన్నే రాజధానిగా ప్రకటించాల్సింది అంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజధాని విషయంలో గత పాలకులు సృష్టించిన గందరగోళానికి ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పారని ఆయన అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు 30వ వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

**ఏపీ రాజధాని అమరావతే**

రాజధానిపై ఐదేళ్లుగా నెలకొన్న అనిశ్చితికి తెరపడిందని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ఐదేళ్లుగా మన రాజధాని ఏదో చెప్పుకోలేని దుస్థితిలో బతికాం. మూడు రాజధానులంటూ గందరగోళం సృష్టించారు. కానీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మూడు రాజధానుల నినాదం ఎక్కడైతే బలంగా వినిపించారో, అక్కడి ప్రజలు కూడా ఎన్డీయే అభ్యర్థులనే గెలిపించారు. ఇకపై ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఎవరైనా ఏపీ రాజధాని ఏది అని అడిగితే, మనమంతా గర్వంగా, కాలర్ ఎగరేసి 'అమరావతి' అని చెప్పుకుందాం. ఇది మనందరి రాజధాని, ప్రజా రాజధాని, దేవతల రాజధాని" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.

**యుగపురుషుడికి నివాళి**

ఎన్టీఆర్ తెలుగు జాతి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే ఏకైక నాయకుడని చంద్రబాబు కొనియాడారు. "ఎన్టీఆర్ మనకు భౌతికంగా దూరమై 30 ఏళ్లు గడిచినా, ఆయన స్ఫూర్తి మనతోనే ఉంది. ఒకప్పుడు మదరాసీలుగా పిలవబడిన తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఆయన ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తుకు తీసుకెళ్లారు. పార్టీ స్థాపించిన కేవలం 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన యుగపురుషుడు ఆయన. విద్యావంతులను, మేధావులను రాజకీయాల్లోకి ఆహ్వానించి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు" అని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు.

**ఎన్టీఆర్ బాటలోనే సంక్షేమం**

ఎన్టీఆర్ ప్రారంభించిన సంక్షేమ పథకాలే తమ ప్రభుత్వానికి స్ఫూర్తి అని చంద్రబాబు తెలిపారు. "ఆనాడు ఆయన రూ.2కే కిలో బియ్యం ఇచ్చి దేశంలో ఆహార భద్రతకు నాంది పలికారు. నేడు మేము అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. ఆయన రూ.35తో ప్రారంభించిన పింఛనును ఇప్పుడు రూ.4 వేలకు పెంచి గౌరవంగా అందిస్తున్నాం. ఆయన చూపిన బాటలోనే పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తున్నాం. ఇటీవల 3 లక్షల గృహ ప్రవేశాలు చేయించాం, ఉగాది నాటికి మరో 5 లక్షల గృహ ప్రవేశాలు చేయిస్తాం" అని వివరించారు.

**భూ హక్కులకు తిరుగులేని భరోసా**

ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. నాడు ఎన్టీఆర్ భూ రికార్డుల్లో పారదర్శకత కోసం మునసబు, కరణం వ్యవస్థను రద్దు చేస్తే, గత పాలకులు కొత్త అధికారులను సృష్టించి ప్రజల ఆస్తులు కొట్టేయాలని చూశారు. వారి కుట్రలను భగ్నం చేశాం. రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందిస్తున్నాం. రీసర్వేను పక్కాగా పూర్తిచేసి, బ్లాక్ చైన్, క్యూఆర్ కోడ్ టెక్నాలజీతో భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయకుండా పటిష్టమైన భద్రత కల్పిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడమే తమ లక్ష్యమని చంద్రబాబు అన్నారు. "దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. నిన్ననే కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇదీ తెలుగువారి సత్తా. కానీ కొందరు దీన్ని కూడా 'క్రెడిట్ చోరీ' అని విమర్శిస్తున్నారు. భోగాపురం విమానాశ్రయం కోసం మేము 2,500 ఎకరాలు సేకరిస్తే, గత ప్రభుత్వం ఐదేళ్లు దాన్ని పక్కన పడేసింది. అమరావతిని స్మశానం అన్నారు. వారి క్రెడిట్ అంతా ఇసుక, మద్యం, మైనింగ్, డ్రగ్స్, గంజాయి మాత్రమే" అని ఆయన విమర్శించారు.

**జలయజ్ఞానికి పునరంకితం**

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "ఎన్టీఆర్ హయాంలో తెలుగుగంగ, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులకు పునాది పడింది. మేము అదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని జలకళతో నింపుతాం. ఈ ఏడాదిలోనే వెలుగొండ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను పూర్తి చేసి చూపిస్తాం. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. శ్రీకాకుళంలోని వంశధార నుంచి నెల్లూరులోని పెన్నా వరకు నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం" అని ప్రకటించారు.

**శాంతిభద్రతలపై ఉక్కుపాదం**

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు హెచ్చరించారు. "రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలను టీడీపీ అంతం చేసింది. ఇప్పుడు కొంతమంది పొలిటికల్ రౌడీలు తయారయ్యారు. ముఖ్యంగా పల్నాడులో గిల్లికజ్జాలు పెట్టుకుని రెచ్చగొడుతున్నారు. ఇలాంటివి మా దగ్గర నడవవు. నా దగ్గర తోక తిప్పలేరు. రాజకీయ ముసుగులో అరాచకాలకు పాల్పడితే ఊరుకునే ప్రసక్తే లేదు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడితే పట్టుకొచ్చి బట్టలూడదీస్తాం. పల్నాడును ప్రక్షాళన చేసి శాంతియుత ప్రాంతంగా మారుస్తాం" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

*** కార్యకర్తలే బలం.. కేంద్రంతో సమన్వయం**

కోటి మంది కార్యకర్తలున్న టీడీపీకి దేశంలో ఏ పార్టీకి లేనంత బలముందని చంద్రబాబు అన్నారు. "కష్టకాలంలో జై టీడీపీ, జై సీబీఎన్ అని నినదించిన కార్యకర్తలకు నా జీవితాంతం రుణపడి ఉంటాను. వారిని గౌరవంగా చూసుకునే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. జాతీయ రాజకీయాల్లో టీడీపీ ఎప్పుడూ కీలక పాత్ర పోషించిందని, ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని, తాము కూడా కేంద్రానికి అదే స్థాయిలో సహకరిస్తామని తెలిపారు. "దేశం బాగుండాలి, రాష్ట్రం ముందుండాలి, తెలుగుజాతి అన్నింటా ముందుండాలన్నదే నా ఆకాంక్ష" అని తన ప్రసంగాన్ని ముగించారు.

## హైదరాబాద్‌లో ట్రాఫిక్ పర్యవేక్షణకు యువ ఐపీఎస్ ఆఫీసర్లు!

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, శాంతిభద్రతల బలోపేతంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, నగరవాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో పలువురు యువ ఐపీఎస్ అధికారులను కీలక స్థానాల్లో నియమించింది. ఈ బదిలీలపై తెలంగాణ డీజీపీ బి. శివధర్ రెడ్డి ఆదివారం మాట్లాడుతూ.. "నగర పాలనను మెరుగుపరచడం ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటి. అందులో భాగంగానే నగరవాసుల ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక, స్థిరమైన పరిష్కారాలు కనుగొనడమే లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టాం" అని తెలిపారు. క్షేత్రస్థాయిలో మంచి పనితీరు కనబరిచిన యువ, డైనమిక్ ఐపీఎస్ అధికారులకు ట్రాఫిక్ విభాగంలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు ఆయన వివరించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డీజీపీ గుర్తుచేశారు. ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని, ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణ, అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఆయన పేర్కొన్నారు. ఈ బదిలీలతో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు కొత్తగా ఏర్పాటైన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు. కొత్తగూడెం అదనపు ఎస్పీగా పనిచేసిన అవినాశ్ కుమార్‌ను హైదరాబాద్ ట్రాఫిక్ I డీసీపీగా, ఉట్నూర్ అదనపు ఎస్పీగా ఉన్న కాజల్‌ను ట్రాఫిక్ II డీసీపీగా నియమించారు. అదేవిధంగా జి. చందన దీప్తిని ఫ్యూచర్ సిటీ అదనపు కమిషనర్‌గా (అడ్మిన్ & ట్రాఫిక్), అభిషేక్ మహంతిని రాష్ట్రవ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా నియమించారు.

## మీరు, మీరు చూసుకోండి... మా మంత్రుల జోలికి రావొద్దు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సంస్థలపై తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. తమ మంత్రుల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వార్తలు రాయవద్దని, మీడియా సంస్థల మధ్య ఏవైనా గొడవలుంటే తలుపులు మూసుకుని కొట్టుకోండి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. సింగరేణి బొగ్గు గనుల కేటాయింపులో కుంభకోణం జరిగిందంటూ మీడియాలో వచ్చిన కథనాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఖమ్మం జిల్లాలో పర్యటించిన ఆయన, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏదులాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా మీడియాను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "మీకు గొడవలుంటే మీరు, మీరు చూసుకోండి. మా మంత్రుల జోలికి మాత్రం రావొద్దు. ఏదైనా రాసేముందు నన్ను వివరణ అడగండి, నేను ఎప్పుడైనా అందుబాటులో ఉంటాను. అంతేకానీ మా మంత్రులను బద్నాం చేయొద్దు. వారిపై వార్తలు వస్తే నా గౌరవానికి భంగం కలుగుతుంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మీడియా సంస్థల మధ్య వివాదం నడుస్తోందన్న ప్రచారం నేపథ్యంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్ నేతలు బలపడేలా తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఆ రెండు మీడియా సంస్థలకు హితవు పలికారు. అనంతరం సింగరేణి అంశంపై మాట్లాడుతూ, కొన్ని పత్రికలు బొగ్గు మాయమైందని, కుంభకోణం జరిగిందని అసత్యాలు రాస్తున్నాయని విమర్శించారు. "సింగరేణి టెండర్లను అనుభవం ఉన్న సంస్థలకే ఇస్తాం. ఇందులో ఏ మాత్రం అవినీతికి తావు లేదు. మా రెండేళ్ల పాలనలో ఎలాంటి అవకతవకలు జరగలేదు" అని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా నుంచే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని గుర్తు చేసుకున్న రేవంత్, జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా రూ.362 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ఆ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డు పొందాలంటే ఎవరో ఒకరు చనిపోవాల్సిన దుస్థితి ఉండేదని, కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని తెలిపారు. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇస్తే, తాము ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని, వైఎస్ఆర్ ఉచిత విద్యుత్ స్ఫూర్తితో 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తున్నామని వివరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు కేటాయించామని చెప్పారు. భద్రాచలం అభివృద్ధిపై మాట్లాడుతూ, కేసీఆర్ రూ.100 కోట్లు ఇస్తానని మాట తప్పారని, తమ ప్రభుత్వం భూసేకరణ పూర్తి చేసి అయోధ్య తరహాలో భద్రాద్రిని అద్భుతంగా తీర్చిదిద్దుతుందని హామీ ఇచ్చారు. మంత్రులంతా సమన్వయంతో పనిచేస్తున్నారని, రాబోయే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## మేడారం జాతర స్పెషల్ బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణం

మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఆర్టీసీ శుభవార్త చెప్పింది. జాతర సందర్భంగా ఆర్టీసీ స్పెషల్ సర్వీసులు నడపనున్న విషయం తెలిసిందే. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శనివారం జాతర స్పెషల్ బస్సులకు టికెట్ ధరలను ఖరారు చేస్తూ ఆర్టీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపింది. వరంగల్, హనుమకొండ నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో మేడారం జాతరకు వస్తారని అంచనా వేసిన అధికారులు.. అక్కడి నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు నడపాలని నిర్ణయించారు. వరంగల్, హనుమకొండ నుంచి మేడారానికి టికెట్ ధర బస్సుల ఆధారంగా రూ.250 నుంచి రూ.500, హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ.1,110 వరకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బస్సుల్లోనూ మహిళలు, బాలికలు, ట్రాన్స్ జెండర్లకు 'మహాలక్ష్మి' పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.

## ట్రంప్ తీరుకు వ్యతిరేకంగా ఈయూ దేశాల ఎమర్జెన్సీ మీటింగ్!

గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో కలిపేసుకోవాలన్న తన అభీష్టాన్ని వ్యతిరేకిస్తున్నాయని ఈయూ కూటమిలోని 8 దేశాలపై డొనాల్డ్ ట్రంప్ తాజాగా 10 శాతం టారిఫ్ లు విధించారు. అయితే, ఈ నిర్ణయాన్ని ఈయూ చీఫ్ లు తప్పుబట్టారు. ట్రంప్ బెదిరింపు సుంకాలపై తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో యురోపియన్ యూనియన్ (ఈయూ) దేశాల అత్యవసర భేటీకి పిలుపునిచ్చారు. ఈ మేరకు యురోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాండెర్ లాన్, యురోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా సంయుక్తంగా ఓ ప్రకటన జారీ చేశారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఈయూ - యూఎస్ సంబంధాలకు తీవ్ర విఘాతం కలిగిస్తాయని ఇందులో వారు హెచ్చరించారు. పరస్పర సహకారం తప్పనిసరిగా మారిన పరిస్థితుల్లో ఈ ధోరణి ఇరువైపులా నష్టం చేకూరుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలు ట్రాన్స్ అట్లాంటిక్ సంబంధాలను దెబ్బతీస్తాయని, వాణిజ్య అడ్డంకులకు ఊతమిస్తాయని చెప్పారు. 'యూరప్ ఐక్యంగా, సమన్వయంతో మరియు దాని సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉంటుంది' అంటూ ఈయూ చీఫ్ లు ట్వీట్ చేశారు. మిత్రదేశాలతో కలిసి డెన్మార్క్ ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌లో నిర్వహించిన సైనిక విన్యాసాలను కూడా వారు సమర్థించారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రతను పెంచడమే ఈ విన్యాసం ఉద్దేశమని స్పష్టం చేశారు. ఇది ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. డెన్మార్క్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తూ చర్చల ప్రాముఖ్యతను ఈయూ గుర్తుచేసింది. ఈ విషయంపై ఉర్సులా వాండెర్ లాన్ ఎక్స్ లో స్పందిస్తూ.. ప్రాదేశిక సమగ్రత మరియు సార్వభౌమాధికారం అంతర్జాతీయ చట్టం యొక్క ప్రాథమిక సూత్రాలని చెప్పారు. ఇవి యూరప్ తో పాటు మొత్తం అంతర్జాతీయ సమాజానికి అవసరమన్నారు. నాటో ద్వారా ఆర్కిటిక్‌లో శాంతి మరియు భద్రతపై మా ఉమ్మడి అట్లాంటిక్ ఆసక్తిని మేము నిరంతరం నొక్కిచెప్పామని వాండెర్ లాన్ పేర్కొన్నారు.



## యూపీలో దట్టమైన పొగమంచు..
## ఎన్‌హెచ్-9పై వాహనాల బీభత్సం

ఉత్తరప్రదేశ్‌లో దట్టమైన పొగమంచు మరోసారి ఘోర ప్రమాదానికి కారణమైంది. అమ్రోహా జిల్లాలో ఆదివారం ఉదయం లక్నో-ఢిల్లీ జాతీయ రహదారి (NH9)పై పలు వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో 12 మందికి పైగా గాయపడ్డారు. గజ్రౌలా కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని షాహ్బాజ్‌పూర్ దోర్ గ్రామ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పొగమంచు కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనిపించకపోవడంతో, దాదాపు 10 వాహనాలు ఒకదాని వెనుక ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో 12 మందికి పైగా గాయపడినట్లు 'ఎన్డీటీవీ' తన కథనంలో పేర్కొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అంబులెన్సులు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయి, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంత సమయం తర్వాత, పోలీసులు క్రేన్ల సహాయంతో ధ్వంసమైన వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ప్రస్తుతం క్షతగాత్రులకు చికిత్స కొనసాగుతోందని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

## 10,000 మందితో కన్నులపండువగా 'బగురుంబా' నృత్యం

త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో ప్రధాని నరేంద్ర మోదీ తన రెండు రోజుల పర్యటనను శనివారం ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా రాజధాని గువాహటిలో నిర్వహించిన భారీ సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10,000 మంది కళాకారులు బోడో సంప్రదాయ నృత్యమైన 'బగురుంబా'ను ప్రదర్శించి గిన్నిస్ రికార్డు సృష్టించారు. నిన్న సాయంత్రం 6 గంటలకు ఈ అద్భుత ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలోనే అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవాల్లో ఒకటిగా నిలిచిందని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తెలిపారు. "బిహు, ఝుమూయిర్ తర్వాత ఇప్పుడు బగురుంబ ప్రపంచ వేదికపై మెరిసే సమయం వచ్చింది" అని ఆయన 'X'లో పోస్ట్ చేశారు. సీతాకోకచిలుక కదలికలను అనుకరిస్తూ చేసే ఈ నృత్యం, ప్రకృతి పట్ల బోడో సమాజానికి ఉన్న ప్రేమకు, గౌరవానికి ప్రతీక. సాధారణంగా బోడో మహిళలు మాత్రమే ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. పురుషులు ఖామ్ (మేక చర్మంతో చేసిన డ్రమ్), సిఫుంగ్ (వెదురు ఫ్లూట్) వంటి సంప్రదాయ వాయిద్యాలను వాయిస్తారు. ప్రకాశవంతమైన ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల దుస్తులు ధరించి కళాకారులు చేసే నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందుకు





సంబంధించిన వీడియోను ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "గువాహటిలో అద్భుతమైన బగురుంబా ద్వౌ కార్యక్రమం!" అనే క్యాప్షన్‌తో ఈ వీడియోను ప్రధాని పంచుకున్నారు. ఈ సాంస్కృతిక వైభవం వెనుక ఒకప్పటి హింసాత్మక గతం నుంచి శాంతియుత భవిష్యత్తు వైపు సాగిన సుదీర్ఘ ప్రస్థానం ఉంది. 198090 దశకాల్లో బోడో మిలిటెంట్ ఉద్యమాలు ఆ ప్రాంతంలో తీవ్రమైన హింసకు, వలసలకు కారణమయ్యాయి. అయితే, 2003లో జరిగిన బోడో ఒప్పందం, ఆ తర్వాత 2020లో ఎన్డీఎఫ్‌బీ, 2021లో ఎన్ఎల్ఎఫ్‌బీ మిలిటెంట్లు లొంగిపోవడంతో బోడోలాండ్‌లో శాంతి శకం మొదలైంది. వేలాది మంది మిలిటెంట్లు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రస్తుతం కోక్రాఝార్, చిరాంగ్, బక్సా, ఉదల్‌గురి జిల్లాలతో కూడిన బోడోలాండ్ టెరిటోరియల్ రీజియన్ (BTR) అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక యంత్రాంగంతో కలిసి పనిచేస్తున్నాయి. ఈ భారీ సాంస్కృతిక కార్యక్రమం బోడో సమాజం సాధించిన శాంతి, పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది.

# చూపు లేని జీవితాలలో అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : చూపు లేని జీవితాలలో అక్షరాల వెలుగు నింపిన మహానుభావుడు లూయిస్ బ్రేయిలి అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం సుభాష్ నగర్ డివిజన్ పరిధి సూరారం కాలనీ లూయీ బ్రేల్ భవనంలో ఏర్పాటు చేసిన లూయీ బ్రెల్ 217వ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో కలిసి నూతన సంవత్సర లూయీ బ్రేల్ క్యాలెండర్ ను ఆవిష్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమంలో భాగంగా వారికి ప్రత్యేక భవనం ఏర్పాటుచేసి వారి సంక్షేమం చేపట్టవలసిన ప్రతీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి, సంక్షేమానికి తోడ్పాటునందించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో కూడా దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతీ సంక్షేమ పథకాన్ని, రాయితీలను, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీలో వారికి అండగా ఉండి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ తెలంగాణ స్టేట్ బ్రాంచ్ ప్రెసిడెంట్ విసి.వీర రాఘవన్, వెల్ఫేర్ అసోసియేషన్ డిసేబుల్డ్ ప్రెసిడెంట్ జి.అంజయ్య, సారా ప్రవీణ్ కుమార్ గౌడ్, లూయిస్ బ్రెయిలీ సూరారం అసోసియేషన్ సభ్యులు సత్యం, ఎస్.రాజ్ కుమార్, నరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

## గురు గోవింద్ సింగ్ ఆశయాలను నేటి యువత పాటించాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : . గురు గోవింద్ సింగ్ ఆశయాలను నేటి యువత పాటిస్తూ సమాజ హితం కోసం పనిచేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. గురు గోవింద్ సింగ్ జయంతి సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ గణేష్ గ్రౌండ్స్ లో ఆదివారం నిర్వహించిన గురు గోవింద్ సింగ్ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణచివేతకు గురైన ప్రజలకు ధైర్యం, ఆత్మగౌరవం నేర్పిన మార్గదర్శకులు గురు గోవింద్ సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నిర్వాహకులు బల్బీర్ సింగ్, అమృత్ సింగ్, అథర్ సింగ్, కరణ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ లో సత్తా చాటిన యువకుడిని అభినందించిన ఎమ్మెల్యే



జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : నేషనల్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ లో సత్తా చాటిన సుభాష్ నగర్ డివిజన్ సాయిబాబా నగర్ కు చెందిన బాడీ బిల్డింగ్ విజేత మహమ్మద్ అబ్బాస్ ఆదివారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం 6వ తేదీన నాగ్ పూర్ లో నిర్వహించిన నేషనల్ జూనియర్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొని 4వ స్థానంలో నిలిచిన కుత్బుల్లాపూర్ వాసి, యువకుడు అబ్బాస్ ను ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పుట్టిన ఊరికి మంచి పేరుతేవాలని అన్నారు. యువకులు కాలాన్ని వృధా చేసుకోకుండా వారి వారి అభిరుచికి తగ్గట్టు దేహ దారుఢ్యం, యోగ వంటి వాటి పట్ల శ్రద్ధను కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ యూసుఫ్, మహమ్మద్ వలీ, ప్రభాకర్, రవి, మహమ్మద్ జహంగీర్, మహమ్మద్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి తీర్థం పుచ్చుకున్న సిపిఎం సీనియర్ నాయకుడు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సిపిఎం సీనియర్ నాయకుడు గడ్డం రాము బిజెపి రాష్ట్ర నాయకుడు గంగిడి మనోహర్ రెడ్డి సమక్షంలో ఆదివారం బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. చౌటుప్పల్ మండలం చిన్న కొండూరు గ్రామానికి చెందిన గడ్డం రాము రెండు దశాబ్దాలుగా సిపిఎం పార్టీకి నిస్వార్థంగా సేవలు అందించారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరారు. గంగిరి మనోహర్ రెడ్డి కాషాయ కండువాను గడ్డం రాముకు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్, సీనియర్ నాయకులు ఊడుగు యాదయ్య, బూత్ ప్రెసిడెంట్ కొండూరు వికాస్, పలువురు పార్టీ నాయకులు స్వామి గౌడ్, కనక చారి, సైదులు, సందీప్, శివ కుమార్, సృజన్, రామకృష్ణ, ప్రకాష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## రజకులు అన్ని రంగాల్లో ముందుండాలి

**- రజక యూత్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రజకులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాల్లో మరింత ముందుండాలని పలువురు అన్నారు. ముస్తాబాద్ రజక యూత్ అసోసియేషన్ 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముస్తాబాద్ మండల కేంద్రంలో రజక యువజన సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేపట్టారు. ముఖ్య అతిథులుగా ముస్తాబాద్ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, అక్కరాజు శ్రీనివాస్‌లు, ఉప సర్పంచ్ తాళ్ల విజయ్ రెడ్డి హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రజక కులస్తులు ఏకతాటిపై ఉండి ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రజక కులస్తుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక యువజన సంఘం నాయకులు దీటి రాహుల్, పున్నం అనిల్, దీటి నర్సింలు, మిరిదొడ్డి శరయ్య, దీటి వెంకటేష్, దీటి రాజు తదితరులున్నారు.




## తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్

*** మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని మాజీ కార్పొరేటర్ జి.సురేష్ రెడ్డి అన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 30వ వర్ధంతి సందర్భంగా సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని పుష్ప గిరి బస్తీ,అంజి రెడ్డి బస్తీ లో గల ఎన్టీఆర్ విగ్రహాలకు ఆయన పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ .. తెలుగుజాతికి వన్నెతెచ్చిన నటులు, ఎన్టీఆర్ , రాజకీయంలో వచ్చినంకనే ప్రతి పౌరుడు కి రాజకీయ అవగాహన తెలిసిందన్నారు. ఆయన సీఎంగా ఉన్నప్పుడు, మంచి మంచి పథకాలు, అందులో ఒకటి ప్రతి పేదవాడి కుటుంబానికి అందేలా చేసిన ఘనత ఎన్టీఆర్ ది అని అన్నారు. స్త్రీలకు ఆస్తిలో వాటా ఉండాలని చట్టం తెచ్చిన ఘనత రామారావుదే అని అన్నారు. బలహీన వర్గాలకు లక్షలాదిగా ఇళ్ళు కట్టించిన గొప్పతనం అతనికి దక్కిందన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం వాగ్దానం చేసి, ఎన్నో ఆర్థిక ఇబ్బందులకు ఓర్చి, తన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారన్నారు. కిలో బియ్యం రెండు రూపాయలు, సంపూర్ణ మద్య నిషేధం, వంటి హామీలతో, మునుపెన్నడూ ఏపార్టీ కూడా సాధించనన్ని స్థానాలు గెలిచి మళ్ళీ అధికారంలోకి వచ్చాడన్నారు. ప్రభుత్వ ఖజానాకు ఎంత భారంపడినా కూడా ఎన్టీఆర్ తన హామీలను అమలుపరిచిన నాయకునిగా గుర్తింపు పొందారు అని అన్నారు.ఈ కార్యక్రమం లో సత్యనారాయణ, సత్యవాణి, శివాజీ, విజయకుమార్, జహంగీర్ స్థానిక బస్తీ వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చేపలు, చికెన్, మాంసం దుకాణాలపై విస్తృత తనిఖీలు

*** 12 కేసులు నమోదు**

*** తూనికలు కొలతలు శాఖ అధికారి మనోహర్**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం :భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో వినియోగదారుల హక్కుల పరిరక్షణలో భాగంగా ఆదివారం తూనికలు కొలతలు శాఖ అధికారులు విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం సంత ప్రాంతం, కొత్తగూడెం పట్టణం, అన్నపూరెడ్డిపల్లి మండలంలోని చేపలు, చికెన్, మాంసం విక్రయ దుకాణాలను పరిశీలించినట్లు తూనికలు కొలతలు శాఖ అధికారి కే. మనోహర్ తెలిపారు. తనిఖీల్లో తూనికలు కొలతల చట్టం, సంబంధిత నిబంధనలను ఉల్లంఘిస్తూ ధృవీకరణ లేని తూకపు యంత్రాలు వినియోగించడం, సరైన ముద్రలు లేకుండా తూకాలు నిర్వహించడం, కొలతల్లో తేడాలు చూపించడం వంటి అక్రమాలు గుర్తించినట్లు తెలిపారు. ఈ ఉల్లంఘనలపై మొత్తం 12 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తూనికలు కొలతల చట్టాన్ని అతిక్రమించిన వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వినియోగదారులను మోసగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. వినియోగదారులు తూకాల్లో అక్రమాలు గమనిస్తే జిల్లా తూనికలు కొలతలు శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని కోరారు. భవిష్యత్తులో జిల్లాలోని సంతలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని మనోహర్ తెలిపారు.

## సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి సయ్యద్ అబ్దుల్ నజీర్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం దక్కింది. ప్రపంచ తెలుగు సంస్కృత వేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో నజీర్ చూపిన అంకితభావం, సృజనాత్మక ప్రతిభను గుర్తించి జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 21న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందజేయనున్నట్లు కళావేదిక జాతీయ అధ్యక్షురాలు జి. ఈశ్వరీ భూషణం వెల్లడించారు.ఇదివరకు కూడా నజీర్ పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రముఖులు, కవులు, కళాకారులు, స్థానికులు ఆయనను అభినందించారు.

## ముస్తాబాద్ మండల ప్రజలపై చల్లని దీవెనలుండాలి

*** బుగ్గ రాజరాజేశ్వర స్వామిని వేడుకున్న సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల ప్రజలపై బుగ్గ రాజరాజేశ్వర స్వామి చల్లని దీవెనలుండాలని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి వేడుకున్నారు. ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లె గ్రామంలో మాఘమాస పండగ సందర్భంగా బుగ్గ రాజేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. మండల ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, అష్టైశ్వర్యాలతో, నిండునూరేళ్లు జీవించేలా దీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మెంగని శ్రీనివాస్, ఉప సర్పంచ్ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు పల్లె ఆనంద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సందుపట్ల చిన్న అంజిరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, పప్పుల భద్రయ్య, గుండం యాదవ రెడ్డి. మేంగని రాజు, సందుపట్ల ఎల్లారెడ్డి, పల్లె దేవయ్య, మొర్రాయి పల్లె గ్రామ మాజీ రైతు బంధు అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకలు

**- అమ్మనాన్న అనాధాశ్రమంలో అన్నదానం**

**- చెరుకు లింగస్వామి గౌడ్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జ్ పబ్బు రాజీవ్ గౌడ్ జన్మదిన వేడుకలను రాజీవ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకు లింగస్వామి గౌడ్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ లోని అమ్మానాన్న అనాధాశ్రమంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకల్లో భాగంగా అనాధాశ్రమంలోని అనాధలకు అన్నదానం చేశారు. మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తొర్పునూరి శ్రీకాంత్ గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, వర్కాల రాము గౌడ్, చింతల శివప్రసాద్, దొడ్డి శివ, జె లింగం గౌడ్, పబ్బతి వెంకటేష్, సుర్వి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తుల్జా భవాని సమాజం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట తుల్జా భవాని సమాజం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆదివారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ పాల్గొని ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు రాజు, తుల్జా భవాని సమాజం సభ్యులు గణేష్, జగదీష్, మనోజ్, రాకేష్, శ్రీకాంత్, రుక్మిణి, భాయ్, సునీత, దీపిక, కళావతి, తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందని కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ జె.కె.శేఖర్ యాదవ్ అన్నారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నంద నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ టిడిపి అధ్యక్షులు మువ్వ రవి కిరణ్ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్టలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. బీసీలకు రాజకీయ అవకాశం ఇచ్చి, పటేల్-పట్వారి వ్యవస్థ రద్దు చేసి మండలాల ఏర్పాటు, రెండు రూపాయల బియ్యం పథకం, విద్య-వైద్య రంగాల అభివృద్ధి వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. మహిళలను రాజకీయాల్లోకి తీసుకురావడంలో కూడా ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, సయ్యద్ రషీద్, సీనియర్ నాయకులు బొడ్డు ఉమామహేశ్వరరావు, డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు గండి రాజు యాదవ్,నాయకులు దేవేందర్, ప్రభాకర్, కొండయ్య, గోవర్ధన్ గౌడ్, శ్రీకాంత్ యాదవ్,కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



**రంగారెడ్డినగర్ డివిజన్ లో ...**

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శ్ నగర్ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించిన నికి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నంద నందమూరి తారక రామారావు 30వ వర్ధంతి కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె. జయరాం, టీ.లక్ష్మారెడ్డి, నాయకులు ఎస్. కనకాచారి,మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు తోపాటు టిడిపి నాయకులు పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బొడ్డు అశోక్ రావు,ఎం.నర్సింగ్ రావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పబ్బు రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సర్పంచ్ జువ్వి నర్సింహ్మ




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకలు చౌటుప్పల్ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకల్లో పబ్బు రాజు గౌడ్ కు ధర్మోజి గూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. పండ్ల బొకేను బహూకరించారు. రాబోయే రోజుల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, రాచకొండ భార్గవ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, మాజీ సర్పంచ్ బద్రి లింగయ్య, మాజీ ఉపసర్పంచ్ కొంత బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరం


* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : శారీరక దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి నగర్ డివిజన్ జి.ఆర్.ప్యాలెస్ వద్ద "బిగ్ బాష్" రూఫ్ టాప్ ఫుట్ బాల్ & బాక్స్ క్రికెట్ ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాక్స్ క్రికెట్ ను అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గౌస్ భాయ్, ఇబ్రహీం, షేక్ రహీమ్, షేక్ అలీమ్, సలీమ్ భాయ్, అజీమ్, ఇల్లూ ఈతేశాం, షేక్ ఇజాజ్, షేక్ సమీర్, గాజుల రామారం కార్పొరేటర్ రావుల శేషగిరి, రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, సీనియర్ నాయకులు ఖాదర్, సుధాకర్, రహీమ్, సాబేర్, అర్షద్, సతీష్ గట్టోజీ, లక్ష్మణ్, రషీద్, మోహన్ లాల్, మజార్ , గౌస్, హాశం, సాయి నేత, అల్లూ, రమ్మీ, కొండా శ్రీనివాస్, నవాబ్ భాయ్, సోనూ, మహమ్మద్ సలీం, ప్రవీణ్ గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లక్కారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఎన్నికల ఇన్చార్జి పబ్బు రాజు గౌడ్ జన్మదిన వేడుకలను టీం పి ఆర్ జి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం బస్టాండ్ ఆవరణ జాతీయ రహదారిపై పబ్బు రాజు గౌడ్ కు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. జెసిబి సహాయంతో గజమాలను వేశారు. జాతీయ రహదారి వెంట లక్కారం క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పబ్బు రాజు గౌడ్ కు శాలువాలతో ఘన సన్మానం చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సర్పంచులు, చౌటుప్పల్ మండల, మున్సిపాలిటీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## 20న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఈ నెల 20న తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. అంతేకాదు 25న రథసప్తమిని వైభవంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం లో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేయనున్నారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఉదయం 9.30 గంటల నుండి భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించనున్నారు.

## ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో బతికే ఉన్నారు: దగ్గుబాటి పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి నేడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఎన్టీఆర్ మరణించి 30ఏళ్లు అయినా ఆయన ప్రజల హృదయాల్లో బతికే ఉంటారన్నారు. తెలుగు చిత్రసీమలో అనేక రకాల పాత్రలు పోశించి అభిమానులను సంపాదించుకున్నారని అన్నారు. నాయకుడిగానే



కాకుండా ప్రతినాయకుడిగానూ నటించి మెప్పించారన్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తరవాత కేవలం అధికారం కోసమే రాజకీయాలు కాదని ప్రజాసంక్షేమం కోసమే రాజకీయాలు అని చాటిచెప్పేలా చేశారన్నారు. ఆనాడు ఆయన ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఇప్పటికీ అమలు అవుతున్నాయన్నారు. కాస్త మార్పులు జరిగినా ఆ పథకాలను ఎవరూ తీసివేయలేదన్నారు. రూపాయికే కిలో బియ్యం, రైతులకు రూ.50కి విద్యుత్, మాండలిక వ్యవస్థ, మహిళలకు చదువు లాంటి పథకాలన్నీ ఎన్టీఆర్ గట్టిగా సంకల్పించి ప్రవేశపెట్టారన్నారు. ఈ ప్రథకాలు ప్రజల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు.

## ఆరోగ్యశాఖలోనూ 'అవేర్' సేవలు

రాష్ట్రంలో సీజనల్ డిసీజెస్‌ను రియల్ టైమ్‌లో పర్యవేక్షించి వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవడానికి రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లోని అవేర్ విభాగం సేవలను వినియోగించుకోనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల ప్రకారం రాష్ట్రంలో వ్యాధులు ప్రబలకుండా సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకునే దిశగా వైద్య, ఆరోగ్యశాఖ అడుగులు వేస్తోందని చెప్పారు. ఇందుకోసం ఆర్టీజీఎస్‌లోని అవేర్ (అడ్వాన్స్ వార్నింగ్ అడ్వైజరీ ఫర్ రిసిలియెంట్ ఎకోసిస్టమ్) ద్వారా రాష్ట్రంలో వ్యాధుల తీవ్రత, వ్యాప్తికి ఉన్నఅవకాశాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వాటిని సత్వరం నివారించే దిశగా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

* **ఐదారు సంవత్సరాల డేటా ఆధారంగా**

గత ఐదారు సంవత్సరా ల్లో (హిస్టారికల్ డేటా) గ్రామాలు, సచివాయాలయాల వారీగా అంటువ్యాధులు (డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర) కేసెస్ డేటా ఆధారంగా విశ్లేషిస్తారు. అలాగే వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యాప్తి చెందే సీజనల్ డిసీజెస్ కు సంబంధించి ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలకు ఆర్టీజీఎస్‌లోని సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోనున్నారు. ఆర్టీజీఎస్ సేవలను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు అవగాహన కలిపించారు.



**ముందస్తు అంచనా**

ఆర్టీజీఎస్‌లోని అవేర్ విభాగం ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను పసిగట్టి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేస్తుంటుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఇప్పుడు మారుతున్న వాతావరణాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో ఎలాంటి వ్యాధులు ప్రబలగలవో డేటా విశ్లేషణతో అవేర్ విభాగం ద్వారా ముందస్తుగానే పసిగట్టి సమర్థవంతమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుందన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర కేసులను సచివాలయాలు వారిగా గుర్తిస్తామని చెప్పారు. ఇందుకు ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు (జియో ఇన్ఫర్మేషన్ సిస్టమ్) కూడా పరిగణలోనికి తీసుకుంటామని తెలిపారు. గత ఐదారు సంవత్సరాల్లో నమోదైన కేసులు వివరాలను కూడా అనుసంధానం చేస్తామని తెలిపారు తద్వారా ప్రాంతాల్లోని పరిస్థితులపై పూర్తి అవగాహన వస్తుందని పేర్కొన్నారు.

### ప్రైవేటు ట్రావెల్స్‌పై కొరడా..


## విశాఖలో ఆర్టీఏ తనిఖీలు

పండగ పేరుతో ప్రయాణికులను ప్రైవేటు ట్రావెల్స్ దోచుకుంటున్నాయి. నిబంధనలకు మించి టికెట్ రేట్లు వసూలు చేస్తున్నారు. సంక్రాంతి ముగియడంతో విశాఖ, విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు భారీగా ప్రయాణికుల రద్దీ పెరిగింది. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ చార్జీల మోత మోగిస్తున్నాయి. విశాఖ నుంచి బెంగళూరుకు టికెట్ రేటు రూ. 6 వేలు వసూలు చేస్తున్నారు. విషయం ఆర్టీఏ అధికారులు



తెలియడంతో తనిఖీలు నిర్వహించారు. విశాఖ సత్యం జంక్షన్‌లో రామ్ దలాల్ ట్రావెల్స్ బస్సులో సోదాలు చేశారు. విశాఖ టు బెంగళూరుకు రూ. 6 వేలు వసూలు చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో బస్సును రెండు గంటలుగా అధికారులు నిలిపివేశారు. ప్రయాణికులను బెంగళూరు తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఆ రాష్ట్రాల్లో భాజపా వ్యూహం అదే: కపిల్ సిబల్



భాజపాపై రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీ అధికారం/ మెజార్టీ లేని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం, అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలను పక్కనపెట్టేయడం అనే వ్యూహాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ వ్యూహం బిహార్‌లో విజయవంతమైందని, ప్రస్తుతం మహారాష్ట్రలో అమలు చేస్తోందని ఆరోపించారు. తాజా మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించిన పరిణామంపై సిబల్ ఈ విధంగా మాట్లాడారు. కాంగ్రెస్‌తో నేరుగా పోటీ పడే ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భాజపా రాజీపడకుండా చూసుకుంటోందని కపిల్ సిబల్ పేర్కొన్నారు. తమిళనాడులో ప్రాబల్యాన్ని విస్తరించుకోవడానికి ప్రయత్నిస్తున్న కాషాయ పార్టీ ఇప్పటికే అనేకసార్లు విఫలమైందన్నారు. అందుకే ఇప్పుడు దేవాలయాల రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కేరళ, పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీ తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొంటోందని అన్నారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ లో చీలికను ప్రస్తావించిన సిబల్ అవకాశవాద రాజకీయాలపై హెచ్చరికలు చేశారు. అజిత్ పవార్‌ను ఉద్దేశిస్తూ.. వారితో (భాజపాతో) రాజీపడటం వల్ల డిప్యూటీ సీఎం కావొచ్చేమో కానీ భవిష్యత్తు ముగిసిపోయినట్లేనన్నారు. మహారాష్ట్రలో ఇటీవల జరిగిన 29 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల్లో మొత్తం 2,869 స్థానాలు ఉండగా 1,425 సీట్లలో విజయం సాధించిన భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది. ముంబయి, పుణెలలో ఠాక్రే, పవార్ కోటలను బద్దలుకొట్టింది. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లో 227 స్థానాలకుగాను 89 చోట్ల భాజపా గెలుపొందిన విషయం తెలిసిందే.

## తొక్కిసలాట ఘటనపై సీబీఐ దర్యాప్తు.. దిల్లీకి విజయ్



కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో టీవీకే అధినేత, నటుడు విజయ్ .. సీబీఐ ముందు సోమవారం మరోసారి హాజరు కానున్నారు. ఇందుకోసం ఆయన ఆదివారం సాయంత్రం ప్రత్యేక విమానంలో చెన్నై నుంచి దిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ కేసులో జనవరి 12న దాదాపు ఆరు గంటలపాటు విజయ్‌ని విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ.. జనవరి 19న విచారణకు రావాలని నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. గతేడాది సెప్టెంబరులో కరూర్‌లో విజయ్ ప్రచారసభ నిర్వహించగా.. అక్కడ జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోన్న సీబీఐ, పలువురు టీవీకే నేతలను విచారించింది. మరోవైపు, ఈ కేసులో అనేక లోపాలున్నాయని చెబుతోన్న టీవీకే.. ఘటన జరిగినప్పుడు అక్కడున్న పోలీసుల సంఖ్యపైనా ముఖ్యమంత్రి, డీజీపీ వేర్వేరు ప్రకటనలు చేశారని ఆరోపించింది.

## రూ.7 చోరీ కేసు.. 50 ఏళ్లకు తీర్పు!



మహారాష్ట్రలో 50 ఏళ్ల నాటి ఓ చోరీ కేసుకు ఎట్టకేలకు తెరపడింది. ఇద్దరు నిందితులతోపాటు ఫిర్యాదుదారుడి గురించి పోలీసులు అనేక ఏళ్లుగా వెతుకుతున్నప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో ఈ కేసుకు ముగింపు పలుకుతున్నట్లు స్థానిక న్యాయస్థానం పేర్కొంది. దక్షిణ ముంబయిలోని మజగావ్ న్యాయస్థానం పాత కేసులపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా 1977 నాటి రూ.7.65 చోరీ కేసు పెండింగులోనే ఉంది. అప్పట్లో ఇది పెద్ద మొత్తమనే చెప్పవచ్చు. అయితే, ఇందులో ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు అనేకమార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేశారు. అయినప్పటికీ వారి ఆచూకీ తెలియలేదు. దీంతో ఈ కేసు దశాబ్దాలుగా మరుగునపడిపోయింది. ఈ కేసును ఇటీవల విచారించిన న్యాయస్థానం.. దాదాపు యాభై ఏళ్ల నాటి ఈ కేసులో ఎటువంటి పురోగతి లేదని.. అలాంటప్పుడు దీన్ని పెండింగ్‌లో ఉంచడంలో అర్థం లేదని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా నిందితులపై ఉన్న అభియోగాలను కొట్టివేసిన న్యాయస్థానం.. రికవరీ చేసిన రూ.7.65లను ఫిర్యాదుదారుడికి ఇవ్వాలని ఆదేశించింది. అప్పీలు గడువు ముగిసేనాటికి.. ఫిర్యాదుదారుడి ఆచూకీ లభించకపోతే ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాలో జమచేయాలని ఆదేశించింది.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు.. అత్యవసర ల్యాండింగ్




లఖ్‌నవూ: దిల్లీ నుంచి బెంగాల్‌లోని బాగ్‌డోగరా బయల్దేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం కలకలం సృష్టించింది. దీంతో విమానాన్ని లఖ్‌నవూలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 238 మంది ప్రయాణికులతో ఎయిరిండియా విమానం దిల్లీ నుంచి బాగ్‌డోగరాకు బయల్దేరింది. విమానం గాల్లో ఉన్న సమయంలో టాయిలెట్‌లోని ఓ టిష్యూ పేపర్‌పై విమానంలో బాంబు పెట్టినట్లు రాసి ఉన్న బెదిరింపు నోట్‌ని సిబ్బంది గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన పైలట్లు లఖ్‌నవూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కి సమాచారం అందించి అత్యవసర ల్యాండింగ్ కోసం అభ్యర్థించారు. దీంతో లఖ్‌నవూ విమానాశ్రయ అధికారులు ఫైర్ టెండర్లు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించేశారు. అనంతరం విమానంలో తనిఖీలు చేశారు. విమానాన్ని టెర్మినల్ ప్రాంతంలో ఉంచినట్లుగా అధికారులు తెలిపారు. ప్రయాణికులు తమ గమ్యస్థానాలను చేరడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## న్యాయవాదులు RTI కింద ఆ సమాచారాన్ని కోరలేరు: సీఐసీ




క్లయింట్ల తరఫున వాదిస్తున్న కేసులకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు న్యాయవాదులు సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించలేరని కేంద్ర సమాచార కమిషన్ స్పష్టం చేసింది. ఈ విధంగా స.హ. చట్టాన్ని ఉపయోగించడం వల్ల దాని ముఖ్య ఉద్దేశాలు దెబ్బతింటాయని పేర్కొంది. హరియాణాలోని ఓ జవహర్ నవోదయ విద్యాలయంలో పండ్లు, కూరగాయల సరఫరా కాంట్రాక్టు రద్దుకు సంబంధించిన వివాదంలో ఓ న్యాయవాది దాఖలు చేసిన రెండో అప్పీల్‌ను సీఐసీ కొట్టివేసింది. కూరగాయలు, పండ్లు సరఫరా చేసే తన సోదరుడి తరఫున అప్పీలుదారు ఈ సమాచారాన్ని కోరినట్లు కేంద్ర సమాచార కమిషనర్ సుధారాణి రేలంగి పేర్కొన్నారు. ''సరఫరాదారుడే స్వయంగా ఆ సమాచారం ఎందుకు అడగలేదు? అనే దానిపై అప్పీల్‌లో ఎటువంటి వివరణ లేదు. తన క్లయింట్ తరఫున అప్పీలుదారు ఈ సమాచారాన్ని కోరినట్లు కనిపిస్తోంది. దీన్ని అనుమతించలేం'' అని కమిషన్ పేర్కొంది. మద్రాసు హైకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉటంకిస్తూ.. ''ప్రాక్టీస్ చేస్తున్న ఒక అడ్వకేట్ తన క్లయింట్ తరఫున వాదిస్తున్న కేసులకు సంబంధించిన సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా కోరలేరు. ఇది చట్టం ముఖ్య ఉద్దేశాలను నీరుగార్చుతుంది'' అని సీఐసీ తెలిపింది. వ్యక్తిగత ప్రయోజనాల కోసం స.హ. చట్టాన్ని ఉపయోగించలేరని, తన ప్రాక్టీసు కోసం న్యాయవాది చేతిలో ఆ చట్టం సాధనంగా మారకూడదని స్పష్టం చేసింది.

## గాజా శాంతి మండలి.. భారత్‌కు ట్రంప్ ఆహ్వానం!





గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన శాంతి మండలి లో భాగస్వామి కావాలని భారత్‌కు ఆహ్వానం అందినట్లు సమాచారం. ఇందులో ఇప్పటికే ఇండోఅమెరికన్, ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు అజయ్ బంగాకు చోటు లభించిన విషయం తెలిసిందే. మరోవైపు ఇందులో భాగస్వామ్యమయ్యేందుకు తమకూ ఆహ్వానం అందినట్లు పాకిస్థాన్ కూడా పేర్కొనడం గమనార్హం. గాజా పరిపాలనకు సంబంధించి రెండు మండళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదిగా పేర్కొంటోన్న ఈ శాంతి మండలిలో సాంకేతిక నిపుణులతో కూడిన ప్రధాన బోర్డుకు ట్రంప్ అధ్యక్షుడిగా ఉంటారు. 'ఎగ్జిక్యూటివ్ బోర్డు'గా ఉండే రెండో మండలి సలహాదారుగా వ్యవహరిస్తుందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. శాంతి మండలిలోని రెండు కీలక మండళ్లకు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, అజయ్ బంగా, టోనీ బ్లెయిర్ సహా పలు దేశాల ప్రతినిధులు ఎంపికయ్యారు. మరోవైపు, ఈ కార్యనిర్వాహక మండలిలో తమ దేశానికి సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంపై ఇజ్రాయెల్ అసంతృప్తి వ్యక్తం చేసింది.


## ధర్మంతోనే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుంది

**: మోహన్ భాగవత్**



ధర్మంతోనే భారత్ విశ్వగురువుగా ఎదుగుతుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధినేత మోహన్ భాగవత్ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక పరిజ్ఞానం ప్రపంచానికి అవసరమని చెప్పారు. ముంబయిలో నిర్వహించిన 'విహార్ సేవక్ ఉర్జా మిలన్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ''ధర్మం అనే సూత్రంపై ప్రతి విషయం ఆధారపడి ఉంది. ఇదే ప్రపంచాన్ని నడిపిస్తోంది. ఈ ఆధ్యాత్మిక వారసత్వాన్ని పూర్వీకుల నుంచి భారత్ పొందింది. మతాన్ని ఆచరించి సత్యానికి కట్టుబడి ఉండే సాధువుల సూచనలను దేశం పాటిస్తోంది. దేశం విశ్వగురువుగా ఎదగాలంటే ధర్మమే అసలైన మార్గం. ఇలాంటి ఆధ్యాత్మిక పరిజ్ఞానం ప్రపంచానికి అవసరం'' అని మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. ''ధర్మం అనే వాహనంలో ప్రయాణిస్తే ప్రమాదాలు ఎప్పటికీ జరగవు. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, మనందర్నీ అదే చోదక శక్తి నడిపిస్తోంది. దేశాలు లౌకికంగా ఉండవచ్చు కానీ.. ఏ జీవి కూడా ధర్మానికి అతీతంగా మనుగడ సాగించలేదు'' అని మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు.

## ఇరాన్ ఆందోళనల్లో మృతుల సంఖ్య 5 వేలు!



ఇరాన్‌లో ఇటీవల జరిగిన ఆందోళనల్లో వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఐదు వేల మరణాలను ధ్రువీకరించినట్లు అధికార వర్గాల సమాచారం. వీరిలో సుమారు ఐదు వందల మంది భద్రతా సిబ్బంది ఉన్నారని టెహ్రాన్ అధికారులు చెప్పినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ వెల్లడించింది. తమ దేశంలో అల్లర్లకు ఇజ్రాయెల్‌తోపాటు విదేశీ శక్తులు కూడా సాయం అందించినట్లు ఇరాన్ అధికారులు ఆరోపించారు. వేలాది మంది ఇరానీయన్ల మరణాలకు వారే కారణమన్నారు. కుర్దిష్ ప్రాంతంలో అల్లర్ల తీవ్రత ఎక్కువగా ఉందని అంగీకరించారు. మరణాల సంఖ్య ఎక్కువగా ఉండవచ్చని నివేదికలు చెబుతుండగా.. ఇవి ధ్రువీకరించిన మరణాలని, ఈ సంఖ్య గణనీయంగా పెరగకపోవచ్చని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, నిరసనకారులపై ఇరాన్ ప్రభుత్వం హింసకు పాల్పడితే తాము జోక్యం చేసుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే దాదాపు 800 మందికి మరణశిక్ష అమలును ఇరాన్ విరమించుకోవడంతో ఉద్రిక్తతలు కాస్త సద్దుమణిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మాట్లాడుతూ.. ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్నారు. నిరసనకారులపై కేసులు కొనసాగుతాయని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేయడం గమనార్హం.

## జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల కలకలం.. కొనసాగుతున్న ఆపరేషన్

జమ్మూ కశ్మీర్‌లో భద్రతా బలగాలు ఆదివారం సింగ్‌పొర ప్రాంతంలో తనిఖీలు చేపట్టాయి. కిశ్త్‌వాడ్ జిల్లాలోని సింగ్‌పొర ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు దాక్కున్నట్లు సమాచారం అందుకున్న భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్రవాదులు నక్కి ఉన్నారనే నిఘా వర్గాల సమాచారంతో అప్రమత్తమైన సైనికులు.. స్థానిక పోలీసుల సహకారంతో సెర్చ్ ఆపరేషన్‌ను చేపట్టారు. ఈ సంయుక్త ఆపరేషన్ నేపథ్యంలో ఇరు వర్గాల మధ్య కాల్పులు కొనసాగుతున్నట్లు సమాచారం.

## భారత్‌లో ఏఐ సేవలకు అమెరికన్లు ఎందుకు చెల్లిస్తున్నారు?

భారత్ వంటి ఇతర దేశాల్లో కృత్రిమ మేధ సేవల కోసం అమెరికన్ వనరులను ఉపయోగించడాన్ని ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. చాట్‌జీపీటీ వంటి ప్లాట్‌ఫామ్‌లు అమెరికా భూభాగంపై ఇక్కడి విద్యుత్తును ఉపయోగించి పనిచేస్తున్నాయని.. కానీ, భారత్ వంటి దేశాల్లో పెద్ద సంఖ్యలో వినియోగదారులకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. ఓ అమెరికన్ ఛానల్‌లో వైట్ హౌస్ మాజీ ప్రధాన వ్యూహకర్త స్టీవ్ బానన్‌తో జరిగిన ఇంటర్వ్యూలో నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. ''భారత్‌లో ఏఐ సేవల కోసం అమెరికన్లు ఎందుకు డబ్బులు చెల్లిస్తున్నారు? చాట్‌జీపీటీ అమెరికా గడ్డపై పనిచేస్తోంది. ఇక్కడి విద్యుత్తును ఉపయోగిస్తోంది. కానీ, భారత్, చైనా ఇలా ప్రపంచవ్యాప్తంగా ఇతర దేశాల్లో పెద్దఎత్తున వినియోగదారులకు సేవలు అందిస్తోంది'' అని నవారో వ్యాఖ్యానించారు. అదే విధంగా అమెరికాలో వ్యవసాయ భూముల కొనుగోళ్లపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ సంస్థలు స్థానిక వ్యవసాయ భూములను వాస్తవ ధర కంటే పది రెట్లు ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి ధోరణులు అమెరికాలో ఆహార ధరల పెంపునకు కారణం కావొచ్చన్నారు.

# అర్ధరాత్రి మహాపూజతో ప్రారంభం కానున్న నాగోబా జాతర







ఉట్నూరు గ్రామీణం: దేశంలో రెండో అతిపెద్ద ఆదివాసీ సంప్రదాయ వేడుక ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా జాతర ఆదివారం అర్ధరాత్రి మహాపూజతో అట్టహాసంగా ప్రారంభం కానుంది. ఆదివాసీ సంప్రదాయ రీతిలో సన్నాయి మోతలు, డోలు వాయిద్యాలు, దివిటీల కాంతుల మధ్య మెస్రం వంశ పెద్దల ప్రత్యేక పూజలతో మహాక్రతువు ఆద్యంతం భక్తుల తన్మయత్మం మధ్య వైభవంగా సాగింది. ముందుగా గర్భాలయం వెనక ఉంచిన పవిత్ర గంగా జలంతో శుద్ధికార్యక్రమం చేపట్టారు. సరిగ్గా అర్ధరాత్రి ఇలవేల్పు శేషసాయికి ఆలయ పీఠాధిపతి వెంకట్‌రావు, కటోడాలు హన్మంతు, కోసు సహా మెస్రం పెద్దలు అంతరంగికంగా నిర్వహించిన అభిషేకంతో మహాపూజలోని ప్రధాన ఘట్టం ముగియనుంది. మెస్రం వంశీయుల దవళ వస్త్రధారణతో విద్యుత్తు కాంతుల ధగధగల మధ్య ఆలయ ప్రాంగణం తెలుపు వర్ణ శోభితమైంది. సంప్రదాయరీతిలో మెస్రం వంశ కొత్త కోడళ్ల భేటీ జరిగింది. సతీక్ దేవత పూజలు చేసి కుల పెద్దల కాళ్లు మొక్కి ఆశీస్సులు తీసుకున్నారు. అంతకుముందు కేస్లాపూర్‌లోని పాత మందిరమైన మురాఢి నుంచి నాగోబా దేవత ఆభరణాలను ఆలయానికి చేర్చారు. మెస్రం ఆడపడుచులు కొత్తకుండలతో కోనేరు నుంచి తెచ్చిన జలంతో అల్లుళ్లు, మెస్రం మహిళలు మట్టితో పుట్టలు తయారుచేసి పూజలు నిర్వహించారు.

## భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు: డి.రాజా



ఖమ్మం: సీపీఐ ప్రస్థానం ఎన్నో త్యాగాలతో మొదలైందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాలు ఖమ్మంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, సీపీఐ అగ్రనేతలు హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సీపీఐ శ్రేణులతో ఖమ్మం నగరం ఎరుపెక్కింది. డి.రాజా మాట్లాడుతూ.. "1925 డిసెంబరు 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించింది. ఇండియాకు సంపూర్ణ స్వరాజ్యం కావాలని ఆరంభంలోనే సీపీఐ చెప్పింది. 1885లోనే కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. ఆ పార్టీ ఏర్పడి 140 ఏళ్లు గడిచాయి. స్వాతంత్ర్య పోరాటంలో కాంగ్రెస్, సీపీఐ కీలకపాత్ర పోషించాయి. స్వాతంత్ర్య సాధన కోసం సీపీఐ శ్రేణులు పోరాటం చేశాయి. ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమీ లేదు. అప్పటి బ్రిటీష్ పాలకులతో ఆర్ఎస్ఎస్ చేతులు కలిపింది. పాలస్తీనాలో మారణహోమం జరుగుతోంది. వేల మంది అమాయకులను ఊచకోత కోస్తున్నారు. ఇజ్రాయెల్, అమెరికా కలిసి పాలస్తీనాలో దారుణాలు చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో హిట్లర్‌లా మారారు. నియంతలా మారి.. అన్ని దేశాలను బెదిరిస్తున్నారు. ప్రధాని మోదీ అమెరికా ముందు తలవంచారు. భారత్ అభివృద్ధి కోసం మోదీ చేసిందేమీ లేదు" అని డి.రాజా అన్నారు.

## మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదం




మేడారం: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ములుగు జిల్లా మేడారంలోని హరిత హోటల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం ఈ సమావేశం వివరాలను మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి.. పొంగులేటి మీడియాకు వివరించారు. "చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మేడారంలో 27వ క్యాబినెట్ భేటీ నిర్వహించాం. మంత్రి సీతక్క చొరవతో సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రుల ఏకాభిప్రాయంతో అద్భుతంగా సమావేశం జరిగింది. అనేక అంశాలను చర్చించాం. ప్రభుత్వానికి సంబంధించిన 14 ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు కావొచ్చు.. రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలు కావొచ్చు.. వీటికి ప్రభుత్వ భూముల కేటాయింపునకు ఆమోదం తెలిపాం. అలాగే, రాష్ట్రంలో గడువు పూర్తయిన 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లు, 2,996 వార్డులు, డివిజన్లలో వీలైనంత త్వరగా ఎన్నికలు జరపాలని నిర్ణయించాం. ఇప్పటికే డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. దీని ప్రకారం రెండు రోజుల క్రితం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. వీలైనంత త్వరగా మున్సిపల్ ఎన్నికలు జరపాలని క్యాబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. 2027 జులై 27 నుంచి ఆగస్టు 3వరకు గోదావరి పుష్కరాలు రానున్నాయి. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటు చేస్తాం. టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుకు ఫిబ్రవరి 15లోపు కన్సల్టెన్సీ నివేదిక ఇస్తుంది. హైదరాబాద్ మెట్రోకు సంబంధించి క్యాబినెట్ సమావేశంలో చర్చించాం. మెట్రో ఫేస్2 ఏ, బీ దశలకు సంబంధించి భూసేకరణకు రూ.2,787 కోట్లు కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ములుగు జిల్లాలో సాగునీరు అందించేందుకు పొట్లపూర్ ఎత్తిపోతల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది" అని వివరించారు.

## కట్టు కథలకు భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు: భట్టి విక్రమార్క



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఆస్తులు, ఆత్మను కాపాడటమే తన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆస్తుల సంపాదన కోసమో.. వ్యాపారాన్ని విస్తరించుకునేందుకో రాజకీయాల్లోకి రాలేదని చెప్పారు. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల విషయంలో ఓ పత్రికలో అడ్డగోలు రాతలు రాశారన్నారు. ప్రజాభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాష్ట్ర ఆస్తులు, వనరులను సంరక్షించి పేదలకు సమానంగా పంచడమే నా లక్ష్యం. సింగరేణి సంస్థ.. నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లను పిలిచింది. దీనిపై కట్టుకథ, పిట్టకథలు అల్లి ప్రజలను మభ్యపెట్టేలా కథనం రాశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని సింగరేణి సంస్థకు సూచించాం. నేను వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిని కాబట్టి.. ఆయనపై ఉన్న కోపం నామీద చూపిస్తున్నారు. ఆ పత్రికలో వచ్చిన కథనం వెనుక రాజకీయ ఉద్దేశం ఏమిటో తెలిశాక పూర్తి వివరాలు వెల్లడిస్తా. గద్దలు, దోపిడీదారులు, వ్యవస్థీకృత నేరగాళ్ల నుంచి తెలంగాణ ఆస్తులను కాపాడతాను. ఒకరి వ్యక్తిత్వాన్ని హననం చేసే కథనాలు రాసే అధికారం ఎవరికీ లేదు. నాయకుల మధ్య విభేదాలు సృష్టించేందుకు కట్టుకథలు రాశారు. దీనికి భయపడి లొంగిపోయే వ్యక్తిని కాదు. సింగరేణి ప్రజల ఆస్తి.. బొగ్గుగనులు ప్రజల ఆత్మగౌరవం. పదవుల కోసం కాదు.. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చాను. టెండర్లను పిలిచింది సింగరేణి సంస్థే.. మంత్రి కాదు. క్లిష్ట ప్రాంతాల్లో గనులున్నందున ఫీల్డ్ విజిట్ నిబంధన తప్పనిసరి. ఇలాంటి నిబంధనలు కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోనూ ఉన్నాయి. ఓ ఛానల్ కథనంలో నా పేరును అనవసరంగా తీసుకువచ్చారు. మీడియా సంస్థల మధ్య ఉన్న విషయాల్లోకి ప్రజాప్రతినిధులను లాగొద్దు. వ్యక్తిగత వ్యవహారాల జోలికి వెళ్లడం తగదు" అని భట్టి విక్రమార్క అన్నారు.

## కొనసాగుతున్న ఎదురు కాల్పులు.. ఆరుగురు మావోయిస్టులు మృతి



భద్రాచలం: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. కాల్పుల్లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. నేషనల్ పార్క్ అడవుల్లో దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు, పశ్చిమ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జి సున్నం చంద్రయ్య ఎలియాస్ పాపారావు.. నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా ఉన్నారని నిఘావర్గాలకు సమాచారం అందడంతో బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేషనల్ పార్క్ ఏరియా కమిటీ చీఫ్ దిలీప్ బెడ్జా సహా నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ తెలిపారు. ఓ మహిళా మావోయిస్టు సహా నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో దిలీప్ బెడ్జా ఉన్నట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో ఇవాళ జరిగిన ఎదురుకాల్పుల్లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## హైవేపై రోడ్డు ప్రమాదం: భార్య మృతి.. భర్త, కుమారుడికి గాయాలు

చౌటుప్పల్: దైవ దర్శనానికి వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా.. భర్త, కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. నల్గొండ జిల్లాల్లో విజయవాడహైదరాబాద్ హైవేపై మల్కాపురం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గుర్రంగూడకు చెందిన దంపతులు పి.దుర్గ (25), ఆమె భర్త, కుమారుడు స్కూటీపై చెరువుగట్టులోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. ఆదివారం ఉదయం తిరిగి వస్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుకనుంచి స్కూటీని ఢీకొట్టడంతో వారు కింద పడిపోయారు. దీంతో దుర్గ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందారు. గాయాలపాలైన ఆమె భర్త, కుమారుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రజాభిప్రాయం మేరకే మున్సిపాలిటీల విభజనపై నిర్ణయం తీసుకోవాలి: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: ప్రజాభిప్రాయం లేకుండా మున్సిపాలిటీల విభజన జరుగుతోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రంగారెడ్డి చుట్టుపక్కల ఉన్న గ్రామాలను చార్మినార్‌లో కలుపుతున్నారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లాలో సగం ఎంఐఎంకు అప్పజెప్పాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. పాతబస్తీలో నల్లా బిల్లులు, కరెంట్ బిల్లులు కడతారా? కట్టని వారితో మా జిల్లా ప్రజలను ఎందుకు కలుపుతున్నారు? అని ప్రశ్నించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మున్సిపాలిటీల విభజన అంశంపై ఎంపీ మాట్లాడారు. "మెజారిటీగా హిందూ ప్రజలున్న గ్రామాలను చార్మినార్‌లో కలపడం సరైంది కాదు. రంగారెడ్డి జిల్లాలోని గ్రామాలను చార్మినార్‌లో కలపడం వల్ల, ఆ జిల్లా ప్రజల బతుకులు ఆగం అవుతాయి. హైదరాబాద్‌కు ఆర్థిక వనరు రంగారెడ్డి జిల్లా.. ఆ జిల్లా ఖజానా అంత నాడు కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు తరలిపోయింది. ఇప్పుడు ఎంఐఎం ఇలకాలోకి పంపేందుకు ప్రయత్నం జరుగుతోంది. పన్నులు కట్టే వాళ్లని, పన్నులు కట్టని వారితో కలపకండి. రంగారెడ్డి జిల్లాపై అనేక అపోహలు ఉన్నాయి. ఈ జిల్లాను ముక్కలు చేసి ఇక్కడి ప్రజల జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టొద్దు. మున్సిపాలిటీల విభజన విషయంలో ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి. ప్రజాభిప్రాయం తర్వాతనే నిర్ణయం తీసుకోవాలి" అని ప్రభుత్వాన్ని కోరారు.

## చంటి బిడ్డతో ట్రాఫిక్ క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్.. ఫిదా అయిన సీపీ సజ్జనార్!

ఏపీలో ఇటీవల చంటిబిడ్డతో ట్రాఫిక్ క్లియర్ చేసిన మహిళా కానిస్టేబుల్‌పై హైదరాబాద్ సీపీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ వేదికగా వీడియో పంచుకున్నారు. ఒక చేతిలో పేగు బంధం.. మరో చేతిలో సమాజ బాధ్యత! అంటూ ఆయన ఫిదా అయ్యారు. డ్యూటీలో లేకపోయినా, చంటి బిడ్డ చంకలో ఉన్నా.. ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న అంబులెన్స్ కోసం స్వయంగా దారి క్లియర్ చేసిన ఏపీలోని రంగంపేట మహిళా కానిస్టేబుల్ ఆముదాల జయశాంతికి హ్యాట్సాఫ్.. అంటూ తెలిపారు. కాకినాడ సామర్లకోట రోడ్డులో ఆమె చూపిన సమయస్ఫూర్తి, విధి నిర్వహణ పట్ల ఆమెకున్న నిబద్ధత అందరికీ ఆదర్శమని చెప్పారు. మాతృత్వానికి, కర్తవ్యానికి సెల్యూట్ అంటూ ట్వీట్‌లో పేర్కొన్నారు. కాగా, రంగంపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళ కానిస్టేబుల్ ఆముదాల జయశాంతి తన డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలోనే కాకినాడ జిల్లా సామర్లకోట ఫ్లైఓవర్ పైన శనివారం రాత్రి విపరీతంగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో ఆమె రంగంలోకి దిగింది. తన బిడ్డను ఎత్తుకొని మరి ట్రాఫిక్ క్లియర్ చేశారు జయశాంతి. ఇక ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఇది చూసిన నెటిజన్స్ ఫిదా అయిపోతున్నారు. ఓ చంటి బిడ్డను ఎత్తుకొని మరి ఇలా ట్రాఫిక్ క్లియర్ చేయడం చాలా గ్రేట్ అని నెటిజన్లు కొనియాడారు.

# ట్రంప్ టారిఫ్‌ల భారం మోస్తూనే.. యూఎస్‌లో సత్తా చాటిన దక్షిణ కొరియా కార్ల కంపెనీలు

**అమెరికా మార్కెట్లో హ్యుందయ్, కియా ఆల్ టైమ్ రికార్డ్**

**2025లో 11.3 శాతం మార్కెట్ వాటా కైవసం**

**హైబ్రిడ్ కార్ల అమ్మకాలు, స్థానిక ఉత్పత్తితో భారీ వృద్ధి**

**మార్కెట్లో జనరల్ మోటార్స్, టయోటా, ఫోర్డ్ తర్వాత నాలుగో స్థానం**

**టారిఫ్ భారాన్ని వినియోగదారులపై మోపకపోవడం కలిసొచ్చిన వైనం**





**న్యూయార్క్:** అమెరికా ఆటోమొబైల్ మార్కెట్లో దక్షిణ కొరియా కార్ల తయారీ సంస్థలు హ్యుందయ్, దాని అనుబంధ సంస్థ కియా సరికొత్త రికార్డు సృష్టించాయి. ట్రంప్ ప్రభుత్వం టారిఫ్‌లను దూకుడుగా పెంచినప్పటికీ 2025లో ఈ రెండు కంపెనీలు కలిసి 11.3 శాతం మార్కెట్ వాటాను దక్కించుకుని ఆల్ టైమ్ రికార్డ్ నెలకొల్పాయి. గతేడాది అమెరికాలో హ్యుందయ్, కియా కలిపి మొత్తం 18.4 లక్షల వాహనాలను విక్రయించాయి.

మార్కెట్ రీసెర్చ్ సంస్థ వార్డ్స్ ఇంటెలిజెన్స్ డేటా ప్రకారం హ్యుందయ్ 9,84,017 యూనిట్లతో 6.1 శాతం వాటాను, కియా 8,52,155 యూనిట్లతో 5.2 శాతం వాటాను సొంతం చేసుకున్నాయి. దీంతో అమెరికా మార్కెట్లో జనరల్ మోటార్స్ (17.5%), టయోటా (15.5%), ఫోర్డ్ (13.1%) తర్వాత ఈ గ్రూప్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం యూఎస్ మార్కెట్ 2.4 శాతం వృద్ధి చెందగా, హ్యుందయ్, కియా అమ్మకాలు 7.5 శాతం పెరగడం విశేషం.

స్థానికంగా ఉత్పత్తిని పెంచడం, హైబ్రిడ్ వాహనాల అమ్మకాలపై దృష్టి పెట్టడం ఈ విజయానికి ప్రధాన కారణాలుగా విశ్లేషకులు చెబుతున్నారు. గతేడాది హ్యుందయ్, కియా హైబ్రిడ్ వాహనాల అమ్మకాలు ఏకంగా 48.8 శాతం పెరిగి 3,31,023 యూనిట్లకు చేరాయి. యోన్హాప్ న్యూస్ ఏజెన్సీ నివేదిక ప్రకారం జార్జియాలో హ్యుందయ్ మూడో ప్లాంట్‌ను పూర్తి చేయడంతో స్థానిక ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది. టారిఫ్ భారాన్ని వినియోగదారులపై మోపకుండా కంపెనీయే భరించడం కూడా అమ్మకాలు పెరగడానికి దోహదపడింది. ఈ వ్యూహం కారణంగా దక్షిణ కొరియా నుంచి అమెరికాకు వాహనాల ఎగుమతులు 4.2 శాతం తగ్గాయి.

## మరింత వేగంగా ఫిర్యాదుల పరిష్కారం

**జులై 1 నుంచి అమల్లోకి: ఆర్‌బీఐ**




**న్యూఢిల్లీ:** బ్యాంకింగ్ సేవల్లో ఎదురయ్యే సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత సమర్థంగా, వేగంగా మార్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులతో పాటు, ఇతర నియంత్రిత సంస్థల ఖాతాదారుల ప్రయోజనాలు కాపాడటమే లక్ష్యంగా 'రిజర్వ్ బ్యాంక్-సమగ్ర అంబుడ్స్‌మన్ పథకం -2026'ను తీసుకురానుంది. ఇందుకోసం 'రిజర్వ్ బ్యాంక్- అంబుడ్స్‌మన్ స్కీం 2025'కు కొన్ని సవరణలతో ముసాయిదాను శుక్రవారం విడుదల చేసి, ప్రజల అభిప్రాయాలు కోరింది. ఇవి కూడా వచ్చాక, క్రోడీకరించి, నిబంధనలు ఖరారు చేస్తుంది. కొత్త పథకం 2026 జులై 1 నుంచి అమల్లోకి రానుంది. ఫిర్యాదిదారులకు తక్కువ ఖర్చుతో, వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఆర్‌బీఐ పేర్కొంది. విచారణలు క్లుప్తంగా ఉంటాయని, ఇవి సాధారణ సాక్ష్యాధారాల నిబంధనలకు లోబడి ఉండవని స్పష్టం చేసింది. ఈ బాధ్యతలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ తన అధికారుల నుంచి ఒకరు లేదా అంతకంటే ఎక్కువమందిని ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్, ఆర్‌బీఐ డిప్యూటీ అంబుడ్స్‌మన్‌లుగా నియమిస్తుంది. సాధారణంగా వీరి నియామక కాలపరిమితి ఒకేసారి మూడేళ్ల వరకు ఉంటుంది.

ఫిర్యాదుల స్వీకరణ, పరిశీలన కోసం ఆర్‌బీఐ ఒకటి లేదా పలు చోట్ల సీఆర్‌పీసీ (సెంట్రలైజ్డ్ రిసీప్ట్ అండ్ ప్రాసెసింగ్ సెంటర్)లు ఏర్పాటు చేయనుంది. వినియోగదారులు తమ ఫిర్యాదులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా సమర్పించే వీలుంటుంది.

నూతన విధానంలో వివాదానికి సంబంధించిన మొత్తంపై గరిష్ఠ పరిమితి విధించలేదు. అంబుడ్స్‌మన్ లేదా డిప్యూటీ అంబుడ్స్‌మన్ ఆ వివాదాలపై రాజీ కుదర్చడం లేదా తగిన తీర్పు (అవార్డు) ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరిస్తారు. ఖాతాదారులకు కలిగిన నష్టానికి సంబంధించి, గరిష్ఠంగా రూ.30 లక్షల వరకు పరిహారం చెల్లించాలని ఆదేశించే అధికారం అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. దీనికి అదనంగా మరో రూ.3 లక్షల వరకు పరిహారం అందించే వీలుందని ఆర్‌బీఐ వెల్లడించింది.

## ఈవీ భవిత.. రాబోయే బడ్జెట్‌లో..

**పీఎల్‌ఐలో మార్పులు అవసరం**

**పెట్టుబడి పరిమితులు తగ్గిస్తేనే అంకురాలకు ఊరట**

**డెలాయిట్ ఇండియా నివేదిక**



**న్యూఢిల్లీ:** దేశంలో విద్యుత్ వాహన (ఈవీ) రంగం కొన్నేళ్లుగా వృద్ధి చెందుతున్నప్పటికీ, 2030 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలంటే ప్రస్తుత విధానాల్లో సమూల మార్పులు అవసరమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్‌ఐ) పథకం నిబంధనలు, జీఎస్‌టీ రేట్లు, ఫేమ్ సబ్సిడీ కొనసాగింపు వంటి అంశాలపై 2026-27 కేంద్ర బడ్జెట్‌లో స్పష్టమైన నిర్ణయాలు ప్రకటించాల్సిన అవసరం ఉందని డెలాయిట్ ఇండియా విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పెట్రోలు, డీజిల్ వాహనాలతో సమానంగా ఈవీలు నిలబడాలంటే, ప్రభుత్వ చేయూత అవసరమని పరిశ్రమ పేర్కొంటోంది. రాయితీలతో పాటు మరికొన్ని విధానపరమైన నిర్ణయాలూ అవసరమని పేర్కొంటోంది.

కేంద్రం వాహన రంగాన్ని ప్రోత్సహించేందుకు తీసుకొచ్చిన పీఎల్‌ఐ పథకం ఉద్దేశం మంచిదే. అయితే ఈ నిబంధనలు ఈవీ రంగానికి పూర్తిగా మేలు చేయడం లేదని డెలాయిట్ నివేదిక తేల్చింది. ఈ పథకం కింద అర్హత సాధించాలంటే వాహన తయారీ కంపెనీలు (ఓఈఎం) అయిదేళ్లలో కనీసం రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాలి. ఇది పెద్ద కంపెనీలకు సాధ్యమే. కానీ, కొత్త ఆలోచనలతో వస్తున్న అంకురాలు, మధ్యతరహా పరిశ్రమలకు అంత తేలిక కాదని నివేదిక వివరించింది.




# కివీస్‌దే సిరీస్

**కోహ్లి వీరోచిత సెంచరీ...**

**అయినా ఓడిపోయిన టీమిండియా...**

**మూడో వన్డేలో టీమిండియాపై న్యూజిలాండ్ ఘన విజయం**

**1-2 తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయిన భారత్**

**విరాట్ కోహ్లి అద్భుత శతకం వృథా**

**డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్ సెంచరీలతో చెలరేగిన కివీస్**

**రాణించిన యువ ఆటగాళ్లు నితీశ్ రెడ్డి, హర్షిత్ రానా**

**ఇండోర్:** భారత పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ జట్టు వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఇండోర్ వేదికగా జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియాపై 41 పరుగుల తేడాతో కివీస్ విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1 తేడాతో చేజిక్కించుకుంది. విరాట్ కోహ్లి అద్భుత శతకంతో పోరాడినా జట్టును గెలిపించలేకపోయాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్‌కు కివీస్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. డారిల్ మిచెల్ (137), గ్లెన్ ఫిలిప్స్ (106) అద్భుత శతకాలతో చెలరేగడంతో న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా చెరో మూడు వికెట్లు పడగొట్టారు.



అనంతరం 338 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో టీమిండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. టాప్ ఆర్డర్ విఫలమైనా, విరాట్ కోహ్లి (124) ఒంటరి పోరాటం చేశాడు. కాగా, కోహ్లికి వన్డేల్లో ఇది 54వ సెంచరీ. అతనికి యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి (53), హర్షిత్ రానా (52) అర్ధశతకాలతో అండగా నిలిచారు. అయినప్పటికీ, కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో భారత్ 46 ఓవర్లలో 296 పరుగులకే ఆలౌట్ అయి ఓటమిపాలైంది. కివీస్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్, జాకరీ ఫౌల్క్స్ చెరో మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

## ఇటలీ జట్టులో దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్..




**అన్నదమ్ములకు వరల్డ్‌కప్ బెర్తు..!**

**న్యూఢిల్లీ:** పొట్టి ప్రపంచకప్ పోటీలకు తొలిసారి అర్హత సాధించిన ఇటలీ పెద్ద జట్లకు షాకిచ్చేందుకు సిద్ధమవుతోంది. భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మొదలవ్వనున్న మెగాటోర్నీ కోసం ఆ దేశ బోర్డు స్క్వాడ్‌ను ప్రకటించింది. వెనే మ్యాడ్‌సెన్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన బృందాన్ని ఆదివారం సెలెక్టర్లు వెల్లడించారు. అయితే.. క్వాలిఫయర్స్‌లో ఇటలీని సమర్థంగా నడిపించి.. ప్రపంచకప్ బెర్తు కట్టబెట్టిన జో బర్న్స్‌కు మాత్రం స్క్వాడ్‌లో చోటు దక్కలేదు.

మొదటిసారి టీ20 ప్రపంచకప్ ఆడబోతున్న ఇటలీ పటిష్టమైన స్క్వాడ్‌తో వస్తోంది. భారత్, శ్రీలంక పరిస్థితులకు తగ్గట్టుగా.. కాంబినేషన్లను సరిచూసుకున్న ఇటలీ వెనే మ్యాడ్‌సెన్ నేతృత్వంలో వరల్డ్‌కప్ బరిలోకి దిగనుంది. ఆదివారం ప్రకటించిన స్క్వాడ్‌లో దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జేజే స్మట్స్(ఏఏ గాఎబీబిబ)కు చోటు దక్కింది. ఇక అన్నదమ్ములు హ్యారీ మనేటి, బెంజమిన్ మనేటిలను తీసుకున్నారు సెలెక్టర్లు.

ఇటలీ స్క్వాడ్ : వెనే మ్యాడ్‌సెన్(కెప్టెన్), మార్కస్ కంపోపియానో(వికెట్ కీపర్), గియాన్ పీరో మీడె, జియాన్ అలీ, అలీ హసన్, క్రిషాన్ జార్జ్, హ్యారీ మనేటి, ఆంథోని మొస్కా, సయ్యద్ నఖ్వీ, బెంజమిన్ మనేటి, జస్ప్రీత్ సింగ్, జేజే స్మట్స్, గ్రాంట్ స్టెవార్ట్, థామస్ డ్రాకా,

ఐసీసీ నిర్వహించే ఒక్క ప్రపంచకప్ అయినా ఆడాలనుకున్న ఇటలీ కల త్వరలోనే సాకారం కానుంది. షెడ్యూల్ ప్రకారం గ్రూప్ సీలోని ఇటలీ ఫిబ్రవరి 9న బంగ్లాదేశ్‌తో తలపడనుంది. అనంతరం.. ఫిబ్రవరి 12న నేపాల్‌తో, ఫిబ్రవరి 16న ఇంగ్లండ్‌తో, ఫిబ్రవరి 19న వెస్టిండీస్‌తో మ్యాడ్‌సెన్ బృందం ఢీకొననుంది.

## భారత్‌లో టీ20 ప్రపంచకప్.. పాక్ సంతతి ఆటగాళ్ల వీసాలపై రంగంలోకి దిగిన ఐసీసీ

**భారత్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌కు ఐసీసీ ముందస్తు ఏర్పాట్లు**

**వివిధ దేశాల తరఫున ఆడుతున్న పాక్ సంతతి ఆటగాళ్ల వీసాలపై దృష్టి**

**ఇంగ్లండ్, నెదర్లాండ్స్ ఆటగాళ్లకు ఇప్పటికే వీసాలు మంజూరు**

**మిగతా వారికి వచ్చే వారం అపాయింట్‌మెంట్లు ఖరారు**

**జనవరి 31 లోగా ప్రక్రియ పూర్తి చేసేందుకు ఐసీసీ చర్యలు**

**న్యూఢిల్లీ:** భారత్‌లో జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు సంబంధించి ఐసీసీ కీలక చర్యలు చేపట్టింది. టోర్నీలో పాల్గొనే వివిధ దేశాల జట్లలో ఉన్న పాకిస్థాన్ సంతతికి చెందిన 42 మంది ఆటగాళ్లు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీసాలు అందేలా చూస్తోంది. చివరి నిమిషంలో తలెత్తే సమస్యలను నివారించేందుకే ఐసీసీ ఈ బాధ్యతను తీసుకుంది.

ఇంగ్లండ్ జట్టులోని పాక్ సంతతికి చెందిన స్పిన్నర్లు ఆదిల్ రషీద్, రెహాన్ అహ్మద్, పేసర్ సాకిబ్ మహమూద్‌లకు ఇప్పటికే వీసాలు మంజూరైనట్లు మీడియా వర్గాలు తెలిపాయి. వీరితో పాటు కెనడా సహాయక సిబ్బందిలోని షా




సలీం జాఫర్‌కు కూడా క్లియరెన్స్ లభించింది.

అమెరికా జట్టులో అలీ ఖాన్, షాయన్ జహంగీర్, నెదర్లాండ్స్‌లో జుల్ఫికర్ సాకిబ్ వంటి పాక్ మూలాలున్న ఆటగాళ్లు ఉన్నారు.

ప్రస్తుతం యూఏఈ, అమెరికా, ఇటలీ, బంగ్లాదేశ్, కెనడా జట్లలోని పాక్ జాతీయత లేదా సంతతికి చెందిన మిగతా ఆటగాళ్లు, అధికారుల వీసాల ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే వారం ఆరంభంలోనే వీరికి వీసా అపాయింట్‌మెంట్లు ఖరారు కావడంతో, ప్రక్రియ చివరి దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. వీసాల జారీకి ఈ నెల 31ని గడువుగా నిర్ణయించారు.

సాధారణంగా పాకిస్థాన్ సంతతికి చెందిన వారు భారత వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే ఎక్కువ పరిశీలన ఉంటుంది, ప్రక్రియ ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలోనే ఐసీసీ ముందుగానే రంగంలోకి దిగింది. ప్రపంచవ్యాప్తంగా పలు నగరాల్లోని భారత హైకమిషన్లతో ఐసీసీ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

# ఆస్ట్రేలియా పర్యటనకు డబ్ల్యూపీఎల్ స్టార్..

**వన్డే, టీ20లకు ఎంపికైన స్పిన్ సంచలనం..!**

**న్యూఢిల్లీ:** వన్డే వరల్డ్‌కప్ విజేత భారత జట్టు తొలి విదేశీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఇటీవలే శ్రీలంకను వైట్‌వాష్ చేసిన టీమిండియా.. ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఇప్పటికే షెడ్యూల్ ఖరారు కావడంతో ఆదివారం వన్డే, టీ20లకు స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన డిప్యూటీగా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఈమధ్యే శ్రీలంకపై తిప్పేసిన వైష్ణవీ శర్మ వన్డే, టీ20లకు ఎంపికవ్వగా.. డబ్ల్యూపీఎల్‌లో చెలరేగి ఆడుతున్న గుజరాత్ జెయింట్స్ హిట్టర్ భారతి ఫుల్‌మాలి టీ20 స్క్వాడ్‌లోకి వచ్చింది. శ్రీలంకపై వికెట్లతో మెరిసిన వైష్ణవీ శర్మ వన్డే, టీ20 స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో భారీ సిక్సర్లతో రెచ్చిపోతున్న భారతి ఫుల్‌మాలి జాతీయ జట్టులోకి తొలిసారి ఎంపికైంది. డబ్ల్యూపీఎల్‌లో వికెట్ల వేట కొనసాగిస్తున్న శ్రేయాంక పాటిల్ పొట్టి ఫార్మాట్ స్క్వాడ్‌లోకి దూసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్‌లో ఆల్‌రౌండర్‌గా.. డబ్ల్యూపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతున్న అమన్‌జోత్ కౌర్ రెండు ఫార్మాట్లకు ఎంపికైంది. అయితే.. ఏకైక టెస్టుకు స్క్వాడ్‌ను ప్రకటించాల్సి ఉంది.

**భారత వన్డే స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలని(వికెట్ కీపర్), స్నేహ్ రానా, దీప్తి శర్మ, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్, కశ్వీ గౌతమ్, రేణుకా సింగ్, శ్రీచరణి, వైష్ణవీ శర్మ, క్రాంతి గౌడ్.




**భారత టీ20 స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలని(వికెట్ కీపర్), జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్, రేణుకా సింగ్, అరుంధతి రెడ్డి, భారతి ఫుల్‌మాలి, శ్రేయాంక పాటిల్, స్నేహ్ రానా, శ్రీచరణి, వైష్ణవీ శర్మ, క్రాంతి గౌడ్.

**ఫిబ్రవరి 15వ తేదీన**

ఆస్ట్రేలియా పర్యటనలో మూడు టీ20లు, మూడు వన్డేలు, ఏకైక టెస్టు ఆడనుంది టీమిండియా. ఫిబ్రవరి 15వ తేదీన తొలి టీ20తో సిరీస్ షురూ కానుంది. ఫిబ్రవరి 19న రెండో మ్యాచ్, ఫిబ్రవరి 21న మూడో మ్యాచ్‌తో పొట్టి సిరీస్ ముగుస్తుంది. అనంతరం.. మూడు రోజులకే .. ఫిబ్రవరి 24న బ్రిస్బేన్‌లో వన్డే సిరీస్ ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 27న హోబర్ట్‌లో రెండో వన్డే, మార్చి 1వ తేదీన చివరి మ్యాచ్ నిర్వహించనున్నారు. భారత జట్టుతో వన్డే సిరీస్ అనంతరం ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగియనుంది.

MOVIE TIME

# సంక్రాంతి బరిలో చిరంజీవి హవా..

## ఆరు రోజుల్లో బ్రేక్ ఈవెన్..!




**టాకీస్:** ఈ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి మార్కెట్ స్ట్రెంగ్త్‌పై ఎలాంటి సందేహాలకు తావు లేకుండా స్పష్టత వచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన 'మన శంకర వరప్రసాద్ గారు' విడుదలైనప్పటి నుంచే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తూ దూసుకుపోతోంది. భారీ సినిమాల పోటీ మధ్యలోనూ ఈ చిత్రం రోజురోజుకూ కలెక్షన్లను పెంచుకుంటూ వెళ్లడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తాజాగా మేకర్స్ విడుదల చేసిన అధికారిక అప్‌డేట్ ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.261 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. పండగ సెలవులను పూర్తిగా వినియోగించుకున్న ఈ మూవీ, విడుదలైన మొదటి వారంలోనే అసాధారణ రన్‌ను నమోదు చేసింది. చిరంజీవి స్టామినా ఇంకా తగ్గలేదని చెప్పడానికి ఇది గట్టి ఉదాహరణగా నిలుస్తోంది. సాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాలు సేఫ్ జోన్‌లోకి రావడానికి కనీసం పది రోజులు నుంచి రెండు వారాల సమయం పడుతుంది. కానీ ఈ సినిమా మాత్రం రికార్డ్ వేగంతో లాభాల బాట పట్టిందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో బయ్యర్లకు ముందుగానే పండగ లాభాలు కనిపిస్తున్నాయి. దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లోనూ 'ఓఎు'కు గట్టి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో చిరంజీవి గత రికార్డులను దాటేస్తూ, కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు రాబట్టిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. త్వరలోనే అక్కడ 3 మిలియన్ డాలర్ల మార్క్‌ను టచ్ చేసే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ అనలిస్టులు అంచనా వేస్తున్నారు. థియేటర్లతో పాటు ఆన్‌లైన్ టికెట్ ప్లాట్‌ఫామ్స్‌లోనూ 'ఓఎు' హవా కొనసాగుతోంది. బుక్ మై షో వంటి యాప్స్‌లో భారీ అడ్వాన్స్ బుకింగ్స్ నమోదవుతూ, పాత రికార్డులను బద్దలు కొడుతోంది. వీకెండ్ అడ్వాన్స్ ట్రెండ్ చూస్తే, వచ్చే రోజుల్లో కూడా కలెక్షన్లు స్ట్రాంగ్‌గా కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ఆరు రోజుల్లోనే రూ.261 కోట్ల మార్క్ దాటడంతో, 300 కోట్ల క్లబ్‌లోకి ఎంటర్ కావడం పెద్ద విషయం కాదని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఒక రీజినల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం టాలీవుడ్‌కు అరుదైన ఘనతగా మారింది. పూర్తి రన్‌లో ఈ సినిమా ఇండస్ట్రీ హిట్ ట్రాక్‌లోకి వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, 2026 ఆరంభంలోనే మెగాస్టార్ చిరంజీవి టాలీవుడ్‌కు స్ట్రాంగ్ ఓపెనింగ్ ఇచ్చారని చెప్పవచ్చు. ఇప్పుడు ఈ జోరు చూసిన తర్వాత, చిరంజీవి కుటుంబం నుంచి రాబోయే తదుపరి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తాయో అన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మరింత పెరుగుతోంది.

# సంక్రాంతి బరిలో 'అనగనగా ఒక రాజు' దూకుడు..

**టాకీస్:** టాలీవుడ్‌లో ఈ తరం యంగ్ హీరోల్లో ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న నటుడు నవీన్ పోలిశెట్టి. స్టార్ ఇమేజ్ కంటే కథ బలం, వినోదమే తన ఆయుధంగా ముందుకెళ్లే నవీన్? ప్రతి సినిమాతో తన పరిధిని విస్తరించుకుంటూ ప్రేక్షకుల మనసుల్లో స్థిరమైన స్థానం సంపాదించుకుంటున్నారు. 'జాతి రత్నాలు'తో కామెడీ హీరోగా బలమైన ముద్ర వేసిన ఆయన, ఆ తర్వాత 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'తో ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా తనవైపు తిప్పుకున్నారు. ఇప్పుడు సంక్రాంతి కానుకగా వచ్చిన 'అనగనగా ఒక రాజు'తో మరోసారి తన మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ ఏంటో చూపించారు. జనవరి 14న విడుదలైన 'అనగనగా ఒక రాజు' మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. క్లీన్ కామెడీతో నవ్వులు పూయిస్తూ, చివర్లో భావోద్వేగాలకు చోటిచ్చిన ఈ సినిమా? "ఇదే అసలైన పండగ సినిమా" అనే టాక్‌ను సంపాదించుకుంది.



కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చిన ప్రేక్షకులు సంతృప్తిగా బయటకు రావడం ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది. కొత్త దర్శకుడు మారి కథను ఎక్కడా లాగకుండా, సరైన పేస్‌తో తెరకెక్కించాడని విమర్శకులు ప్రశంసిస్తున్నారు. బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా రన్ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. విడుదలైన తొలి రోజే రూ.22 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టి గట్టి ఆరంభం చేసింది. ఆ తర్వాత మూడు రోజుల్లోనే రూ.61 కోట్లకు పైగా గ్రాస్ సాధించి సెన్సేషన్ క్రియేట్ చేసింది. రోజుకు సగటున రూ.20 కోట్లకు పైగా వసూళ్లు రాబడుతూ, సంక్రాంతి సెలవుల్లో స్ట్రాంగ్‌గా నిలిచింది. ఈ జోరు చూస్తే సెలవులు ముగిసేలోపు రూ.100 కోట్ల క్లబ్‌లోకి ఎంటర్ అవడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# పాత గాసిప్స్‌ను మళ్లీ తెరపైకి తెచ్చిన నోరా..

టాకీస్: సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోలు, హీరోయిన్లపై డేటింగ్, పెళ్లి వార్తలు రావడం కొత్తేమీ కాదు. కలిసి సినిమాలు చేయకపోయినా, ఒకే వేదికపై కనిపించినా లేదా ఒకే పార్టీలో పాల్గొన్నా వెంటనే రిలేషన్‌షిప్ కథనాలు వినిపిస్తాయి. సరిగ్గా ఇప్పుడు ఇదే పరిస్థితి ఎదుర్కొంటోంది బాలీవుడ్ డ్యాన్సింగ్ సెన్సేషన్ నోరా ఫతేహి. టీ-సిరీస్ అధినేత భూషణ్ కుమార్ నోరా మధ్య ఏదో ఉందంటూ ఐదేళ్ల క్రితం ఒక రెడిట్ యూజర్ చేసిన పోస్ట్ ఇప్పుడు టిక్ టాక్ లో మళ్ళీ ప్రత్యక్షమై హల్చల్ చేస్తోంది. అప్పట్లో ఆ రెడిట్ పోస్ట్‌లో.. 'నోరా ఫతేహి వాడుతున్న ఖరీదైన బ్రాండెడ్ బ్యాగులు, లగ్జరీ కార్లు, ఆమె మెయింటైన్ చేస్తున్న హై-క్లాస్ లైఫ్ స్టైల్ వెనుక భూషణ్ కుమార్ హస్తం ఉంది. టీ-సిరీస్ లో ఆమెకు వస్తు న్న వరుస ఆఫర్లు కూడా అందుకే..' అంటూ ఘాటైన ఆరోపణలు చేశారు. అయితే, ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న నోరా, తాజాగా ఒక టిక్ టాక్ వీడియో కింద ప్రత్యక్షమై తనదైన శైలిలో రిప్లై ఇచ్చింది. కేవలం "వావ్" అంటూ ఒకే ఒక్క పదం, ఒక నవ్వుతున్న ఎమోజీతో ఆ రూమర్లను లైట్ తీసుకుంది. నోరా ఇచ్చిన ఈ 'సావేజ్' రిప్లై ఇప్పు డు నెట్టింట చర్చనీయాంశమైంది. "ఖచ్చితం గా ఆమె తన రేంజ్‌లో కౌంటర్ ఇచ్చింది" అని కొందరు ఫ్యాన్స్ అంటుం టే.. "మళ్ళీ ఆ పాత రూమర్లకు ఆమె కామెంట్ చేయడం వల్ల దానికి అనవసరమైన హైప్ వచ్చింది" అని మరి కొందరు అభిప్రాయ పడుతున్నారు. మొత్తం మీద నోరా ఫతేహి ఇప్పుడు సోషల్ మీడియా లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచింది.

### పుష్ప రాజ్ హవా

# తగ్గేదే లేదు..

## మూడో భాగంతో మరింత రచ్చ చేసేందుకు సిద్ధం

**టాకీస్:** భారతీయ సినీ పరిశ్రమలో ప్రస్తుతం అత్యంత ప్రభావవంతమైన స్టార్లలో అల్లు అర్జున్ ముందు వరుసలో నిలిచారు. 'పుష్ప' సిరీస్‌తో ఆయన సంపాదించిన గుర్తింపు కేవలం ఒక సినిమా విజయంగా కాకుండా, ఒక ఫెనామెనాన్‌గా మారింది. ముఖ్యంగా 'పుష్ప 2: ది రూల్' దేశవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తుడిచిపెట్టేసి, రూ.1800 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లతో తెలుగు సినీ చరిత్రలోనే టాప్ విజయాల్లో ఒకటిగా నిలిచింది. ఈ విజయంతో బన్నీ క్రేజ్ నార్త్ నుంచి సౌత్ వరకూ మరింత విస్తరించింది.ఇంతటి సక్సెస్ తర్వాత పుష్ప కథ ఇక్కడితో ముగుస్తుందనే అభిప్రాయం మొదట వినిపించినా, దర్శకుడు సుకుమార్ మాత్రం అభిమానులను మరోసారి షాక్ ఇచ్చారు.

'పుష్ప 2' క్లైమాక్స్‌లోనే మూడో భాగానికి స్పష్టమైన సంకేతం ఇస్తూ 'పుష్ప 3: ది ర్యాంపేజ్' అనే టైటిల్‌ను రివీల్ చేయడం సినిమాపై ఉన్న ఆసక్తిని మరింత పెంచింది. థియేటర్లలో ఆ సీన్ పడిన క్షణం నుంచి సోషల్ మీడియాలో ఊహాగానాలు జోరందుకున్నాయి. తాజాగా వైరల్ అవుతున్న కథనాల ప్రకారం, మూడో భాగంలో పుష్ప రాజ్ పాత్ర మరింత క్రూరంగా, వ్యూహాత్మకంగా మారనుందట. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ తర్వాత తన ఎర్రచందనం సామ్రాజ్యాన్ని సంపూర్ణంగా నియంత్రించుకోవడమే కాకుండా, తనను మోసం చేసిన వారిపై కూడా పుష్ప ప్రతీకారం తీర్చుకుంటాడనే టాక్ వినిపిస్తోంది. ఈ భాగంలో పుష్పకు ఎదురయ్యే శత్రువులు కేవలం బయటవాళ్లే కాకుండా, లోపలే ఉన్న ద్రోహులేననే అంశం కథకు ప్రధాన బలం కావచ్చని సమాచారం.




ఇప్పటికే ఈ స్క్రిప్ట్ పనులు గోప్యంగా జరుగుతున్నాయని, హైదరాబాద్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో సుకుమార్ టీమ్ కథను మరింత బలంగా మలుస్తోందని ప్రచారం జరుగుతోంది. ఈ ఒక్క లీక్‌తోనే పుష్ప 3పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇదిలా ఉండగా 'పుష్ప 2' జపాన్‌లో 'పుష్ప కున్రిన్' పేరుతో విడుదలై అక్కడ కూడా మంచి స్పందన తెచ్చుకుంటోంది. విదేశీ మార్కెట్ల నుంచి వస్తున్న ఆదరణ ఈ ఫ్రాంచైజ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా మార్చేస్తోంది. ఇదే ఊపులో పుష్ప 3 షూటింగ్ 2027 వేసవిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పుష్ప 3 సెట్స్‌పైకి వెళ్లేలోపు అల్లు అర్జున్ మరికొన్ని భారీ ప్రాజెక్టులను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీతో తన 22వ సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తుండటంతో అంచనాలు మరింత పెరిగాయి. అంతేకాదు, లోకేష్ కనగరాజ్‌తో కూడా ఓ భారీ ప్రాజెక్ట్ లైనప్‌లో ఉంది.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న

# శర్వానంద్, సాక్షి వైద్య



**టాకీస్:** తిరుమల పుణ్యక్షేత్రంలో టాలీవుడ్ సినీ నటులు శర్వానంద్, సాక్షి వైద్య సందడి చేశారు. ఆదివారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో వీరిద్దరూ శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి చేరుకున్న సినీ బృందానికి తితిదే అధికారులు సాదర స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఇటీవల వీరిద్దరి కలయికలో విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించి, విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా స్వామివారిని దర్శించుకోవడానికి తాము తిరుమలకు వచ్చినట్లు శర్వానంద్ మీడియాకు వెల్లడించారు. తమ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతూ, శ్రీవారి ఆశీస్సులతో మరిన్ని మంచి చిత్రాలు చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# 'పెద్ది' కోసం రామ్ చరణ్ బీస్ట్ మోడ్..

## సోషల్ మీడియాను ఊపేస్తున్న మెగా మేకోవర్!

టాకీస్: మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన రాబోయే భారీ పాన్-ఇండియా చిత్రం 'పెద్ది' కోసం పూర్తి 'బీస్ట్ మోడ్'లోకి మారిపోయారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా కోసం చరణ్ చేస్తున్న మేకోవర్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. తాజాగా చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఒక పవర్‌ఫుల్ ఫోటోను షేర్ చేస్తూ, తదుపరి సవాలుకు సిద్ధంగా ఉన్నాను నిశ్శబ్దంగా తన పనిని కానిస్తున్నాను అంటూ క్యాప్షన్ ఇచ్చాడు. ఈ ఫోటోలో చరణ్ భారీగా కండలు పెంచి, రగ్గడ్ లుక్‌లో కనిపిస్తుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమా కోసం రామ్ చరణ్ తన శరీరకృతిని పూర్తిగా మార్చేసి గ్రామీణ క్రీడాకారుడి పాత్రకు తగ్గట్టుగా 'నెవర్ బిఫోర్' అవతార్‌లోకి మారారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఒక భారీ షెడ్యూల్ కోసం చరణ్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఈ ఫొటో చూస్తే అర్థమవుతుంది. ఇందులో కీలక సన్నివేశాలతో పాటు ఒక ఇంటెన్స్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. 'పెద్ది' సినిమాను 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఈ విషయంలో వస్తున్న వాయిదా రూమర్లను చిత్ర యూనిట్ పదేపదే కొట్టిపారేస్తోంది. ఈ చిత్రంలో చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తుండగా కన్నడ సూపర్ స్టార్ శివరాజ్




కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాలోని మొదటి సాంగ్ 'చికిరి చికిరి' ఇప్పటికే ఐదు భాషల్లో కలిపి 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి గ్లోబల్ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.

# నా మాటల్ని తప్పుగా అర్థం చేసుకున్నారు

## వివాదంపై ఏఆర్ రెహమాన్ వివరణ!

**టాకీస్:** బాలీవుడ్‌లో మతపరమైన ధోరణులు పెరిగాయంటూ ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఒక ఇంటర్వ్యూలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎనిమిదేళ్లుగా బాలీవుడ్‌లో పవర్ షిఫ్ట్ మారిందని సృజనాత్మకత లేని వ్యక్తుల చేతుల్లోకి పవర్ వెళ్లిందని ఆయన వ్యాఖ్యానించారు. దీనికి మతపరమైన అంశం ఓ కారణమై ఉండొచ్చు. అలాగే 'ఛావా' వంటి కొన్ని ప్రాజెక్టులు విభజనను ప్రోత్సహించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. అయితే రెహమాన్ చేసిన వ్యాఖ్యలు పెను దుమారం రేపిన నేపథ్యంలో ఆయన తాజాగా తన వివరణను ఇస్తూ ఒక అధికారిక ప్రకటనను విడుదల చేశారు. తన మాటల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని స్పష్టం చేస్తూ భారతదేశం పట్ల తనకున్న అంకితభావాన్ని ఆయన మరోసారి చాటుకున్నారు. ఈ సందర్భంగా ఒక స్టేడియంలో వేలాదిమంది అభిమానులు 'మా తుఝే సలామ్' పాడుతున్న వీడియోను షేర్ చేస్తూ తన సందేశాన్ని వినిపించారు.

భారతదేశమే తన స్ఫూర్తి అని, గురువు, తన ఇల్లు అని పేర్కొన్న రెహమాన్, సంగీతం ఎప్పుడూ తనను భారతీయ



సంస్కృతితో అనుసంధానించే మార్గంగానే ఉందని తెలిపారు. కొన్నిసార్లు తన మాటలను తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని, అయితే తన ఉద్దేశ్యం ఎప్పుడూ దేశాన్ని గౌరవించడం, సేవ చేయడం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఎవరినీ బాధపెట్టడం తన ఉద్దేశ్యం కాదని, తనలోని నిజాయితీని అందరూ గుర్తిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.